# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

18.12.2025 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 168 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana







# ఆ ఇద్దరూ తగ్గట్లే!

- కోరుట్లలో 'హాట్ టాపిక్'గా మారిన ఓ భూ వివాదం
- అనుమతి రద్దు నుంచి.. మానవ హక్కుల ఆశ్రయం వరకు..

05



# రూ.6000 కోట్లు 'ఆంబుక్క'!

2022-23 ఖరీఫ్ సీజన్ సీఎమ్మార్ మాయం

## ఒక్క జగిత్యాల జిల్లాలోనే రూ.225.27 కోట్లు స్వాహా

విజిలెన్స్-ఎన్ఫోర్స్ మెంట్ అధికారుల తనిఖీల్లో నిల్వలు లేవని నివేదికలిచ్చినా 'స్వాహా-రైస్ మిల్లర్ల'పై చర్యలు శూన్యం

06







- మూడు విడతల్లో ఎన్నికలు పూర్తి
- మూడో విడతలోనూ కాంగ్రెస్ ఆధిక్యం
- బలమైన ప్రతిపక్షంగా పోటీ ఇచ్చిన బీఆర్ఎస్
- 22న సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ప్రమాణం
- పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగించిన ఈసీ

# హస్తగతం

**హైదరాబాద్, డిసెంబర్ 17:** తెలంగాణలో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మద్దతుదారులు పైచేయి సాధించారు. మొత్తం 4,158 స్థానాల్లో ఎక్కువ చోట్ల గెలిచి ఆధిక్యాన్ని చాటారు. భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాల్‌పల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, కామారెడ్డి, ఖమ్మం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. రాత్రి 8 గంటల వరకు కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవాలతో కలిపి 1850, భారత రాష్ట్ర సమితి 960, భాజపా 180, ఇతరులు 390 సర్పంచ్ స్థానాల్లో గెలు పొందారు. మూడో దశ ఎన్నికల కోసం 182 మండలాల్లో మొత్తం 4,159 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడగా.. అందులో 11 సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 394 పదవులు ఏకగ్రీవమయ్యాయి. రెండు జీపీలలో ఎన్నికలపై న్యాయస్థానం స్టే విధించింది.

వివరాలు 3లో..

# స్పీకర్ ప్రసాద్ కుమార్ పంచతంత్రం



## ఆ ఐదుగురు పార్టీ మారినట్లు రుజువు లేదు

- తెల్లం, బండ్ల, గూడెం, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి బీఆర్ఎస్ సభ్యులే
- అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ సంచలన తీర్పు

**హైదరాబాద్, డిసెంబర్ 17:** ఎమ్మెల్యేలు పార్టీ మారానడానికి ఎలాంటి ఆధారాలు లేవు.. అందువల్ల వారిని అనర్హులుగా ప్రకటించలేమని తెలంగాణ తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీర్పు వెలువరించారు. తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టి వేస్తూ కీలక నిర్ణయం ప్రకటించారు.

వివరాలు 3 లో



## కారు బీభత్సం

ఇద్దరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

.. వివరాలు 3లో

## సిరిసిల్ల గడ్డ మరోసారి గులాబీ అడ్డా

117 పంచాయతీల్లో 80 స్థానాలు కైవసం చేసుకున్న బీఆర్ఎస్

రెండు దశాబ్దాల బంధం చెక్కుచెదరలేదు: కేటీఆర్

03



## హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి

స్వాగతం పలికిన గవర్నర్, డిప్యూటీ సీఎం



03



04

## ఆపరేషన్ సిందూర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు

క్షమాపణలు చెప్పేది లేదని మహారాష్ట్ర మాజీ సీఎం ప్రకటన

## కొత్త డిస్కమ్‌కు ఆమోదం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



.. 3లో

## సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి

02



- గ్రామపాలన పడకేయడంతో ఓటుతో సమాధానం
- తూప్రాన్ మండల సర్పంచ్‌లతో హరీష్ రావు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయని.. రేవంత్ రెడ్డికి మైండ్ బ్లాక్ అయిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.

## హిడ్మా ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో పిల్

పిల్ దాఖలు చేసిన జయ విద్యాల

వివరాలు 3వ పేజీలో



## రాజేంద్రనగర్‌లో హైకోర్టు భవన నిర్మాణం

02





# రాజేంద్రనగర్‌లో హైకోర్టు భవనం

**పనుల పురోగతిని పరిశీలించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ**

**హైదరాబాద్, డిసెంబర్ 17:** రాష్ట్ర ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులను రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు ఆర్‌అండ్ బి చీఫ్ ఇంజనీర్లు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి క్షేత్రస్థాయి ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు మరియు కన్సల్టెంట్లు పాల్గొన్నారు. పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంబంధిత అధికారులు, సంస్థలకు కీలక ఆదేశాలను జారీ చేశారు. సుమారు రూ. 2583.00 కోట్లు వ్యయంతో 36.52 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న హైకోర్టు భవనం రాష్ట్ర ఐకానిక్ బిల్డింగ్‌లా ఉండాలని, అధికారులు అందుకు తగ్గట్టుగా మనసుపెట్టి పనిచేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పనుల్లో జాప్యం కలగకుండా ఉండటానికి, కన్సల్టెంట్లు డ్రాయింగ్ షెడ్యూల్‌ను ముందుగానే అందించాలి. దీనివల్ల కాంట్రాక్ట్ సంస్థ అవసరమైన సిబ్బందిని, యంత్రాలు, సామగ్రిని సిద్ధం చేసుకోవడానికి వీలవుతుంది. కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థను ఆదేశించారు. 'నుల పురోగతిపై శాఖా పరమైన అధికారులు కన్సల్టెంట్ మరియు కాంట్రాక్టర్‌తో తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జ్యుడీషియల్ అధికారుల సూచనల మేరకు సవరించిన ఎ÷–లాన్లను వెంటనే సిద్ధం చేసి అనుమతులు తీసుకోవాలని కన్సల్టెంట్లను ఆదేశించారు. అలాగే, జోన్ 2కి సంబంధించిన అటవీ శాఖ అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ చీఫ్ ఇంజనీర్‌కు సూచించారు.

# పంచాయతీ పోలింగ్ సరళిపై సీఎస్, డీజీపీ సమీక్ష

**ఎన్నికల కమిషనర్‌తో కలిసి వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలన**

**వెబ్ టెక్నాలజీతో ఎన్నికల్లో పారదర్శకత మరింత పెరుగుతుంది: సీఎస్**



**హైదరాబాద్, డిసెంబర్ 17:** రాష్ట్రంలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల మూడో విడత పోలింగ్ సరళిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డిలు బుధవారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో వెబ్‌కాస్టింగ్ వంటి ఆధునిక టెక్నాలజీని మరింత విస్తృతంగా వినియోగించి ఎన్నికలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో టెక్నాలజీ వినియోగం వల్ల గ్రామాల్లో శాంతిభద్రత సమస్యలు గణనీయంగా తగ్గుతాయని, ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం పెరిగి పోలింగ్ శాతం మరింత మెరుగవుతుందని ఆయన పేర్కొన్నారు. మొదటి, రెండో విడతలతో పోలిస్తే మూడో విడతలో పోలింగ్ శాతం పెరిగే అవకాశముందని సిఎస్ ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీజన, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మందా మకరందం తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రజల్లో కేసీఆర్ సీఎం కావాలన్న ఆకాంక్ష

**సర్పంచ్ ఎన్నికల ఫలితాలే నిదర్శనం: హరీష్ రావు**

**సిద్దిపేట, డిసెంబర్ 17 :** కేసీఆర్ సీఎం కావాలని.. బీఆర్ఎస్ మళ్లీ రావాలని ప్లలె ప్రజలు తీర్పునిచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయాని తెలిపారు. సిద్దిపేట జిల్లా నాంచారుపల్లి బీజేపీ సర్పంచ్ నరసింహారెడ్డి ఇవాళ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దకోడూరుకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కపట నాటకాలకు సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని అన్నారు. బీజేపీది సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కాదు.. అది సబ్‌కా బక్వాస్ అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు.. పేదల పథకాలకు ఎసరుపెట్టే కటింగ్ మాస్టర్ అని విమర్శించారు. మహిళలకు రూ. 55 వేలు, వృద్ధులకు రూ. 44 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని అన్నారు.

# భూపాలపల్లిలో కూలిన చెక్ డ్యామ్

**జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 17:** మల్హర్ రావు మండలం వల్లెకుంట గ్రామ పరిసరాల్లో మానేరుపై నిర్మించిన చెక్ డ్యాం కొద్దిమేర కూలిపోయింది. 10 మీటర్ల మేర చెక్ డ్యాం గోడ కూలింది. ఫలితంగా నీరంతా దిగువకు వృథాగా పోతోంది. ఘటన జరిగిన సమయంలో చేపలు పడుతున్న ఇద్దరు మత్స్యకారులు ప్రవాహ ఉధృతికి

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి

- గ్రామపాలన పడకేయడంతో ఓటుతో సమాధానం
- తూప్రాన్ మండల సర్పంచులతో హరీష్ రావు



**సిద్దిపేట, డిసెంబర్ 17:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయని.. రేవంత్ రెడ్డికి మైండ్ బ్లాక్ అయిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. పల్లె ప్రకృతి వనాలు, డంపు యార్డులు అన్నీ మూలకు పడ్డాయని తెలిపారు. అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని.. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. బుధవారం గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మండలనికి చెందిన పలువురు సర్పంచ్‌లను హరీష్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయని... ప్రజల తీర్పు చూసి కాంగ్రెస్ నాయకులకు షాక్ తగిలిందన్నారు. మొదటి దఫా ఫలితాలు చూసి షాక్ అయ్యారని.. రెండో దఫా ఫలితాలు చూసి మైండ్ బ్లాక్ అయ్యిందంటూ కామెంట్స్ చేశారు. ఇక ఈ రాత్రి వచ్చే మూడో దశ ఫలితాలు కూడా కాంగ్రెస్ పార్టీనీ నిరాశపరచక తప్పదని అన్నారు. ఈ ఓటమి భయంతోనే ఇప్పుడు డబ్బు సంచులు పట్టుకొని హైదరాబాద్ నుంచి బయలుదేరారని తెలిపారు. పోలీసులను అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. నాడు ఢిల్లీలో అవార్డులు ఇస్తే తెలంగాణ ప్లలెల పేర్లు లేకుండా జాబితా ఉండేది కాదని.. కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో తెలంగాణకు ఒక్క అవార్డు కూడా రాలేదని అన్నారు. ప్లలెలు అపరిశుభ్రంగా మారాయని... కనీసం కేసీఆర్ కొనిచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ పోసే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. నాడు కేసీఆర్ ప్రతి నెలా ప్లలెలకు నిధులు విడుదల చేసేవారని.. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులు బంద్ అయ్యాయన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులను మాజీ మంత్రి హెచ్చరించారు. దాడులు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. బిఆర్ఎస్‌లో గెలిచిన వారిని బలవంతంగా పార్టీలో చేర్చుకోవాలని చూసినా కుదరదన్నారు. ఎందుకంటే బీఆర్ఎస్ కార్యకర్తలు ఉద్యమకారులని గుర్తుంచుకోవాలని..వారు బెదిరింపులకు లొంగరని స్పష్టం చేశారు. దేశం వన్ నేషన్ వన్ ఎలక్షన్ దిశగా వెళ్తోందని.. బహుశా మరో ఆరు నెలల్లోనో ఏడాదిలోనో ఎన్నికలు రావచ్చని చెప్పుకొచ్చారు. రెండేళ్లలో కచ్చితంగా మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని... మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. గెలిచిన సర్పంచులంతా ధైర్యంగా ఉండాలని.. మళ్ళీ గ్రామాలకు మంచి రోజులు వస్తాయని... అభివృద్ధి పథంలో గ్రామాలన్నీ ప్రయాణిస్తాయని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.

# సిరిసిల్ల గడ్డ మరోసారి గులాబీ అడ్డా

- 117 పంచాయతీల్లో 80 స్థానాలు కైవసం చేసుకున్న బీఆర్ఎస్
- అధికారంలో ఉన్నా చతికిలపడ్డ కాంగ్రెస్
- ప్రగల్భాలకే పరిమితమైన బీజేపీ
- రెండు దశాబ్దాల బంధం చెక్కుచెదరలేదు: కేటీఆర్

**సిరిసిల్ల, డిసెంబర్ 17:** సిరిసిల్ల నియోజకవర్గంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అద్భుత విజయాన్ని నమోదు చేసింది. సిరిసిల్ల గడ్డ మరోసారి గులాబీ అడ్డా అని రుజువైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే శ్రీ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. మొత్తం 117 గ్రామ పంచాయతీలకు గాను బీఆర్ఎస్ మద్దతుదారులు ఏకంగా 80 స్థానాల్లో ఘన విజయం సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జరిగిన ఈ ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్ అధికార దుర్వినియోగం, బల ప్రయోగానికి పాల్పడినా కేవలం 24 పంచాయతీల్లోనే గెలుపొందగలిగిందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఇక బీజేపీ మాత్రం కేవలం 13 గ్రామ పంచాయతీల్లో మాత్రమే తమ మద్దతుదారులను గెలిపించుకోగలిగింది.



ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ స్పందిస్తూ,

"గత రెండు దశాబ్దాలుగా సిరిసిల్ల ప్రజలకు బీఆర్ఎస్ పార్టీతో ఉన్న అనుబంధం ఎంత బలమైనదో ఈ ఫలితాలు మరోసారి స్పష్టం చేశాయి. ఉద్యమ పార్టీగా ఉన్నా, అధికార పార్టీగా ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండానే గుండెల్లో పెట్టుకున్నారు" అని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసిన కేటీఆర్, ఎన్నికల కోసం అహర్నిశలు కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. విజయం సాధించిన సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులందరికీ అభినందనలు తెలియజేశారు. "అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా, బీజేపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టి బీఆర్ఎస్‌పై నమ్మకం ఉంచిన సిరిసిల్ల ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అని కేటీఆర్ పేర్కొన్నారు.

**సిరిసిల్లలో కాంగ్రెస్ దయనీయ స్థితి**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సిరిసిల్లలో ఘోర పరాజయం చవిచూసింది. కాంగ్రెస్ మద్దతు ఉన్న అభ్యర్థులు కేవలం 24 స్థానాలకు మాత్రమే పరిమితమయ్యారు. దాదాపు 50కి పైగా గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయి మూడో స్థానానికి పరిమితమయ్యారు. ముఖ్యంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సొంత మండలమైన ముస్తాబాద్‌లోనే ఆ పార్టీ కేవలం మూడు పంచాయతీల్లో మాత్రమే గెలుపొందడం గమనార్హం.

**బీజేపీ ప్రగల్భాలకు చెక్**

సిరిసిల్లలో మెజారిటీ స్థానాలు గెలుస్తామని బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన ప్రకటనలు క్షేత్రస్థాయిలో పూర్తిగా తేలిపోయాయని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ప్రజలు బీజేపీని పూర్తిగా తిరస్కరించారని, కేవలం 13 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులు నామమాత్రపు పోటీకి పరిమితమై ఓటమి పాలయ్యారని తెలిపారు. సిరిసిల్లలో బీజేపీకి రాజకీయ ఉనికి లేదని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు.

# పసుపు రైతాంగం కోసం టర్మరిక్ సమ్మిట్ బాటలు వేయాలి

- రైతు ఆధారిత పథకాలపై మేధోమథనం అవసరం
- గిట్టుబాటు ధర బాధ్యత టర్మరిక్ బోర్డే తీసుకోవాలి
- వ్యవసాయ ఉత్పత్తులే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక
- టర్మరిక్ వాల్యు చైన్ సమ్మిట్ 2025లో మంత్రి తుమ్మల




**హైదరాబాద్, డిసెంబర్ 17:** దేశంలో పండే పసుపును ప్రపంచ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు సమిష్టి చర్యలు అవసరమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లో సీఐఐ తెలంగాణ, నేషనల్ టర్మరిక్ బోర్డు సంయుక్తంగా నిర్వహించిన టర్మరిక్ వాల్యు చైన్ సమ్మిట్%–%2025లో పాల్గొన్న ఆయన, పసుపు రైతుల సంక్షేమం, విలువ జోడింపు, ఎగుమతుల అవకాశాలపై విస్తృతంగా ప్రసంగించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రకటించిన అగ్రి వెర్షన్ 2047ను మంత్రి గుర్తుచేశారు. వ్యవసాయాన్ని కేవలం సంక్షేమ రంగంగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ప్రధాన ఇంజన్‌గా ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. ఈ అగ్రి విజన్‌లో పసుపు కీలక పాత్ర పోషించాల్సి ఉ ఒదన్నారు. పసుపు మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని పేర్కొన్న మంత్రి, వంటింటికే పరిమితం కాకుండా మెడిసిన్, న్యూట్రాస్యూటికల్స్, ఫంక్షనల్ ఫుడ్స్ రంగాల్లో పసుపు వినియోగం వేగంగా పెరుగుతోందని చెప్పారు. "ప్రపంచవ్యాప్తంగా పసుపు సాగులో భారత్ అగ్రస్థానంలో ఉంది. పసుపు రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. పసుపు అధికంగా పండే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఆర్మూర్ పసుపుకు జీఐ ట్యాగ్ రావడం తెలంగాణ రైతులకు గర్వకారణం" అని మంత్రి తెలిపారు. నిజామాబాద్ రైతుల చిరకాల ఆకాంక్ష మేరకు నేషనల్ టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, అది పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బోర్డు కేవలం కార్యాలయ పరిమితుల్లో కాకుండా, రైతులకు పాలసీ దిశానిర్దేశం చేసే సంస్థగా పనిచేయాలని, పరిశోధనను రైతు పొలాలకు తీసుకెళ్లాలని, మార్కెటింగ్, బ్రాండింగ్, ఎగుమతుల్లో నాయకత్వం వహించాలని కోరారు. తెలంగాణలో అనుకూల వాతావరణం, కష్టపడే రైతులు ఉన్నప్పటికీ ధరల హెచ్చుతగ్గుల కారణంగా పసుపు సాగు విస్తీర్ణం తగ్గుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఒక క్వింటా పసుపు ఉత్పత్తికి రూ. 8,000%–%9,000 వరకు ఖర్చవుతుండగా, మార్కెట్ ధరలు రూ. 12,000 అటుఇటుగా మాత్రమే ఉండటం రైతులను నిరుత్సాహపరుస్తోందన్నారు. నేషనల్ టర్మరిక్ బోర్డు విజన్ 2047కు అనుగుణంగా పనిచేసి ధరల స్థిరత్వం, ముందస్తు మార్కెట్ సంకేతాలు రైతులకు అందించాలని సూచించారు. ప్రామాణిక మాయిశ్చర్ మీటర్లు, ఒకే రకమైన తేమ ప్రమాణాలు, పారదర్శక మార్కెట్ వ్యవస్థ అమలు చేయాలని అన్నారు. అధిక కర్క్యూమిన్ రకాలను రైతులకు అందించడం, నాణ్యమైన టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు ద్వారా ప్రపంచ ప్రమాణాలకు తగ్గ పసుపు ఉత్పత్తి సాధ్యమవుతుందని చెప్పారు. అప్పుడు మాత్రమే తెలంగాణ పసుపు అంతర్జాతీయ మార్కెట్లలో నిలదొక్కుకుంటుందని స్పష్టం చేశారు. విజన్ 2047 ప్రకారం ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌లో పసుపును భాగం చేయాలని మంత్రి సూచించారు. ఆయిల్ పామ్ వంటి పంటల్లో చెట్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పసుపును అంతరపంటగా సాగు చేయడం ద్వారా తక్కువ రిస్క్‌తో అధిక ఆదాయం లభిస్తుందని వివరించారు. రైతులు ముడి పసుపు విక్రయానికే పరిమితం కాకుండా విలువ జోడింపుపై దృష్టి పెట్టాలని మంత్రి పిలుపునిచ్చారు. పసుపు ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి న్యూట్రాస్యూటికల్స్, ఇమ్యూనిటీ ఉత్పత్తులు, కాస్మోటిక్స్, కర్క్యూమిన్ ఎక్స్‌ట్రాక్షన్ వంటి రంగాల్లోకి వెళ్లాలని సూచించారు. దీనివల్ల డిమాండ్ పెరిగి రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టర్మరిక్ బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, టర్మరిక్ బోర్డు సెక్రటరీ భవానీ శ్రీ, సీఐఐ తెలంగాణ చైర్మన్ శివప్రసాద్ రెడ్డి, అగ్రి యూనివర్సిటీ మాజీ వీసీ ప్రవీణ్ రావు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గంగాధర్, సింథైట్ ఇండస్ట్రీస్ స్ట్రాటజిక్ సోర్సింగ్ హెడ్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# హస్తగతం.. కాంగ్రెస్ ఆధిక్యం



**హైదరాబాద్, డిసెంబర్ 17:** తెలంగాణలో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మద్దతుదారులు పైచేయి సాధించారు. మొత్తం 4,158 స్థానాల్లో అత్యధిక స్థానాల్లో గెలిచి ఆధిక్యాన్ని చాటారు. భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాల్‌పల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, కామారెడ్డి, ఖమ్మం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. రాత్రి 7 గంటల వరకు కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవాలతో కలిపి 1564, భారత రాష్ట్ర సమితి 756, భాజపా 134, ఇతరులు 339 సర్పంచ్ స్థానాల్లో గెలు పొందారు. మూడో దశ ఎన్నికల కోసం 182 మండలాల్లో మొత్తం 4,159 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడగా... అందులో 11 సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 394 పదవులు ఏకగ్రీవమయ్యాయి. రెండు పంచాయితీల్లో ఎన్నికలపై న్యాయస్థానం స్టే విధించింది. మిగిలిన 3,752 సర్పంచి పదవులకు బుధవారం పోలింగ్ జరిగింది. ఉదయం 7నుంచి 1 గంటవరకు పోలింగ్ జరగగా, 2 గంటల నుంచి కౌంటింగ్ మొదలు పెట్టారు. పలు గ్రామాల్లో ఇంకా కౌంటింగ్ కొనసాగుతోంది. మూదు దశలతో పంచాయితీ సమరం ముగిసింది. గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు ఎన్నికయ్యారు. ఈ నెల 22న సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ప్రమాణం చేస్తారు. దీంతో గ్రామాల్లో పాలన ప్రారంభం కానుంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మూడో దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్ పక్రియ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్, మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. గడువు ముగిసే సమయానికి క్యూలైన్‌లో ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ మూడో దశలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,752 సర్పంచ్ స్థానాలకు, 28,410 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అయితే.. మధ్యాహ్నం 1 గంటల వరకు 80.78శాతం పోలింగ్ నమోదయ్యింది. సర్పంచ్ ఎన్నిక ఫలితాలను అధికారికంగా ప్రకటించిన వెంటనే, తదుపరి పక్రియగా ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించారు. సర్పంచ్ ఫలితం తేలిన తర్వాత, నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, వారి సమక్షంలో ఉప సర్పంచ్ ఎన్నికను పూర్తి చేసారు. మెజారిటీ గ్రామాల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి.

### పలు చోట్ల స్వల్ప ఘర్షణలు

పంచాయతీ ఎన్నికల మూడో దశ పోలింగ్ నేపథ్యంలో పలు చోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. గ్రామాల్లో ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను రానుపోను కిరాయి డబ్బులు ఇచ్చి రప్పించారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ కొనసాగింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్యూలో నిల్చున్న వారికి ఓటేసేందుకు అవకాశం కల్పించారు. కాగా, మొదటి, రెండో విడతల ఎన్నికల మాదిరిగానే మూడో విడత తెలంగాణ సర్పంచ్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ గట్టి పోటీనిచ్చింది.

# స్పీకర్ ప్రసాద్ కుమార్ పంచతంత్రం

### ఆ ఐదుగురు పార్టీ మారినట్లు రుజువు లేదు

### తెల్లం, బండ్ల, గూడెం, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి బీఆర్ఎస్ సభ్యులే

### అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ సంచలన తీర్పు



**హైదరాబాద్, డిసెంబర్ 17:** ఎమ్మెల్యేలు పార్టీ మారానడానికి ఎలాంటి ఆధారాలు లేవు.. అందువల్ల వారిని అనర్హులుగా ప్రకటించలేమని తెలంగాణ తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీర్పు వెలువరించారు. తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ కీలక నిర్ణయం ప్రకటించారు. ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు ఆధారాలు చూపలేకపోయారని తీర్పులో పేర్కొన్నారు. అనర్హత వేటుకు తగిన ఆధారాలు లేవని, సాంకేతికంగా ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు భారత రాష్ట్ర సమితిలోనే ఉన్నట్టు స్పష్టం చేశారు. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలు చేయగా.. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణ ఇంకా పూర్తి కాలేదు. అనర్హత పిటిషన్లపై సభాపతి త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై ఈనెల 19న మరోమారు విచారణ జరగనుంది. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేసిన సభాపతి.. బుధవారం ఐదుగురికి సంబంధించి తీర్పు ఇచ్చారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌కు సంబంధించి గరువారం తీర్పు వెలువడనుంది. రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక తీర్పునిచ్చారు. ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. వారిపై అనర్హత వేటు వేసేందుకు తగిన ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. పార్టీ మారినట్లు సరైన ఆధారాలు చూపలేదని తీర్పు సందర్భంగా స్పీకర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కడియం శ్రీహరి, దానం నాగేందర్, కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్ లు తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి మారారని, వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చారు. ఈ విషయంలో స్పీకర్ ఆలస్యం చేస్తుండటంతో.. బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్లపై పలు దఫాలుగా విచారించిన సుప్రీం ధర్మాసనం.. డిసెంబర్ 18వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్..బుధవారం ఐదుగురు ఎమ్మెల్యేల కేసులో తీర్పును వెలువరించారు.పార్టీ ఫిరాయింపుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేసిన పిటిషన్లను స్పీకర్ కొట్టేశారు. ఇక, మిగిలిన వారిలో ముగ్గురు ఎమ్మెల్యేలకు సంబంధించిన కేసులో గురువారం నాడు తీర్పు వెలువరించనున్నారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలను ఇంకా విచారించాల్సి ఉంది. వీరికి స్పీకర్ నోటీసులు జారీ చేసినప్పటికీ.. ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు. వీరి విషయంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది సస్పెన్స్‌గా మారింది.

# స్పీకర్ తీర్పు రాజ్యాంగ విరుద్ధం

### హైకోర్టులో సవాల్ చేస్తాం: బీఆర్ఎస్

**హైదరాబాద్, డిసెంబర్ 17:** ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, ఆయన నిర్ణయంపై హైకోర్టుకు వెళ్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కె.సంజయ్ తెలిపారు. ఇది స్పీకర్ నిర్ణ యం కాదని, జూబ్లీహిల్స్ ప్యాలెస్ రాజు నిర్ణయమని విమర్శించారు. స్పీకర్‌ను ముఖ్యమంత్రి ఇబ్బంది పెడుతున్నారని సంజయ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్ రాజు నుంచి ఎప్పుడో జడ్జిమెంట్ వచ్చిందని, ఆర్డర్ కాపీ జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుంచి వచ్చిందని సంజయ్ విమర్శించారు. ట్రెజరీ బెంచ్‌కి టాయిలెట్ దగ్గరగా ఉంటుందని కాంగ్రెస్ వాళ్ళ పక్కన కూర్చున్నామని తమ ఎమ్మెల్యేలు చెబుతున్నారని సంజయ్ అన్నారు. 'మా వాదనలు పట్టించుకోకుండా ఏకపక్షంగా తీర్పునిచ్చారు. స్పీకర్ తీరు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంది. తీర్పు కాపీని అధ్యయనం చేసి హైకోర్టుకు వెళ్తామ'ని సంజయ్ తెలిపారు. ట్రిబ్యునల్ చైర్మన్ గా ఉన్న స్పీకర్ తీర్పును వ్యతిరేకిస్తున్నామని, స్పీకర్ రాజ్యాంగానికి, చట్టానికి లోబడి ఉండాలని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. స్పీకర్ పూర్తిగా విఫలమయ్యారని, స్పీకర్ తీర్పుపై జనాలు నవ్వుకుంటున్నారని,



వ్యవస్థలపై ఉన్న నమ్మకం పోయిందని అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారితే ఉప ఎన్నికలు వస్తాయా అని సీఎం అన్నారని, తాజాగా స్పీకర్ జడ్జిమెంట్ కూడా సీఎం మాటలలాగానే ఉందని విమర్శించారు.

# హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి

### ద్రౌపది ముర్ముకు స్వాగతం పలికిన గవర్నర్, డిప్యూటీ సీఎం

**హైదరాబాద్, డిసెంబర్ 17:** శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు చేరుకున్నారు. హకీంపేట ఎయిర్–పోర్టులో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు డిసెంబర్ 17 నుంచి 22 వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.




హకీంపేట, అల్వాల్, బొలారం, తిరుమలగిరి, కార్ఖానా ప్రాంతాల్లో వాహనాల డైవర్షన్ కొనసాగుతుంది. రాష్ట్రపతి పర్యటన ముగిసే వరకు డ్రోన్లు, పారా గ్లైడర్స్, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఎగురవేతపై నిషేధం. 18న సికింద్రాబాద్ లోని రాష్ట్రపతి నిలయంలో ఆమె విశ్రాంతి తీసుకుంటారు. 19న రామోజీ ఫిలిమ్ సిటీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు హాజరవుతారు. పలు అభివృద్ధి శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేస్తారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పాల్గొంటారు. 21న రాష్ట్రపతి నిలయంలో ప్రముఖుల కోసం 'ఎట్ హోమ్', పౌరుల భేటీ లో పాల్గొంటారు. 22న సాయంత్రం ప్రత్యేక విమానంలో తిరిగి ఢిల్లీకి బయలుదేరుతారు.

# 20,21 తేదీల్లో రెండ్రోజులు ఉపరాష్ట్రపతి పర్యటన

### ఏర్పాట్లను ఆరా తీసిన సీఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్, డిసెంబర్ 17:** భారత ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ హైదరాబాద్‌లో ఈ నెల 20 ,21 తేదీల్లో పర్యటించనున్నారు. డిసెంబర్ 20 వ తేదీన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని అక్కడ నుండి నేరుగా రామోజీ ఫిలిం సిటీకి వెళ్తారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొని అక్కడ నుండి లోక్ భవన్‌లో రాత్రి బస చేస్తారు. 21వ తేదీ ఉదయం కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ధ్యాన దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని అక్కడి నుండి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకొని న్యూఢిల్లీ తిరిగి వెళ్తారు. ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సంబంధిత ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. బందోబస్తు ఏర్పాట్లు, ఉప రాష్ట్రపతి ప్రయాణించే మార్గంలో రహదారుల నిర్వహణ, ప్రోటోకాల్ తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. ఉప రాష్ట్ర పతి పర్యటనకు ఏ విధమైన లోటు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.





# మైలార్‌దేవ్‌పల్లిలో కారు బీభత్సం

### ఇద్దరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్, డిసెంబర్ 17:** మైలార్‌దేవ్‌పల్లిలో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని దుర్గానగర్‌లో బుధవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఇన్నోవా కారు మితిమీరిన వేగంతో వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా అదుపుతప్పి అత్యంత వేగంగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న దుప్పట్లు, రగ్గులు అమ్ముకునే దుకాణంలో నిద్రిస్తున్న తండ్రి, కుమారులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దీపక్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి ప్రభు మహారాజ్, సోదరుడు సత్తునాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఉస్మానియా హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ప్రభు మహారాజ్ జీవనోపాధి నిమిత్తం ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చి హైదరాబాద్ నగరంలోని మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో రోడ్డు పక్కన దుప్పట్లు, రగ్గులు అమ్ముకుంటు జీవితం గడుపుతున్నాడు. ఇన్నోవా కారు ఈరోజు తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ నుండి సంతోష్‌నగర్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అయితే కారులో మొత్తం ఆరుగురు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఆరుగురిలో ముగ్గురు పరారు కాగ.. మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో ఉన్న సిసిటీవీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 22న సర్పంచుల ప్రమాణ స్వీకారం

### 20 నుంచి 22కు వాయిదా వేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, డిసెంబర్ 17:** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ వాయిదా పడింది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ నెల 20వ తేదీన బాధ్యతలు స్వీకరించాల్సి ఉండింది. అయితే, ముహూర్తాల కారణంగా బాధ్యతల స్వీకరణ రెండు రోజులు ముందుకు జరిగింది. డిసెంబర్ 20వ తేదీన సరైన ముహూర్తాలు లేవని.. 22కు వాయిదా వేయాలని ప్రజా ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. వారి విజ్ఞప్తులపై పంచాయతీరాజ్ శాఖ సానుకూలంగా స్పందించింది. సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ తేదీని 20 నుంచి 22వ తేదీకి మార్పు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే రోజున నూతన సర్పంచులు, వార్డు సభ్యులు పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు.డిసెంబర్ 22వ తేదీన జరిగే మొదటి సమావేశంలో కొత్త పాలకవర్గాలు ప్రమాణస్వీకారం చేయనున్నాయి.

# హిడ్మా ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో పిల్

### పిల్ దాఖలు చేసిన జయ వింధ్యాల

**అమరావతి, డిసెంబర్ 17:** మావోయిస్టు అగ్ర నేత హిడ్మా ఎన్‌కౌంటర్ సంచలనంగా మారింది. హిడ్మాతోపాటు ఇతరుల ఎన్‌కౌంటర్ పై పీపుల్స్ యూనిటి ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైట్స్ ఫోరం అధ్యక్షురాలు జయ వింధ్యాల హై కోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సిట్టింగ్ జడ్జితో లేదా ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జయ వింధ్యాల దాఖలు చేసిన పిటీషన్ విచారణ సందర్భంగా ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాళపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ఉంచారు. మెజిస్ట్రీరియల్ విచారణపై పిటిషనర్ల కు అభ్యంతరం ఉంటే సెషన్స్ జడ్జ్ లేదా మెజిస్ట్రేట్‌ని ఆశ్రయించాలని పేర్కొన్నారు. నేరుగా హై కోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేయడం కంటే, కింది కోర్టులో ఫిర్యాదు చేసి విచారణ కోరడం సరైన పక్రియ అని అయన అభిప్రాయపడ్డారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత చట్టబద్ధంగా జరగాల్సిన మెజిస్ట్రీరియల్ విచారణ ఇప్పటికే మొదలైందని, దర్యాప్తు సంస్థలు నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నాయని ఏజీ కోర్టుకు తెలిపారు. ఇదిలా ఉంటే.. అడ్వకేట్ జనరల్ దమ్మాళపాటి శ్రీనివాస్ వాదనలను పరిగణలోకి తీసుకున్న హై కోర్టు ధర్మాసనం, ఈ విషయంలో మరింత లోతుగా అధ్యాయనం చేయాలని పిటీషనర్ తరుపు న్యాయవాదిని ఆదేశించడం గమనార్హం.

# దేశీయ క్యాబ్ భారత్ ట్యాక్సీ

### జనవరి 1నుంచి ఢిల్లీలో ప్రారంభం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి ప్రైవేటు సంస్థలకు దీటుగా కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా సహకార క్యాబ్ సేవలు ప్రారంభం కాబోతున్నాయి. 'భారత్ ట్యాక్సీ' పేరుతో వస్తున్న ఈ సేవలు వచ్చే నెల నుంచి ప్రారంభం కాబోతున్నాయి. తొలుత దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 1వ తేదీ నుంచి ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్టు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఆ తర్వాత ఈ యాప్ సేవలను దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తేనున్నారు. ఇందులో ఆటో, క్యాబ్, బైక్ సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. ఈ సేవలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్లు వెల్లడించింది. ఈ భారత్ ట్యాక్సీ యాప్ ఆండ్రాయిడ్, ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులో ఉంటుంది. యూజర్లు తమ మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇదివరకు ఉన్న క్యాబ్ ఛార్జీల నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగించేలా.. ఎలాంటి సర్వీస్ ఛార్జీలు లేకుండానే ఈ సేవలను పొందే అవకాశముంది. సుమారు 56 వేల మంది డ్రైవర్లు భారత్ ట్యాక్సీ యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ సేవల్లో రైడ్ ద్వారా వచ్చే ఆదాయం మొత్తాన్ని డ్రైవర్లకే చెల్లిస్తారు. అతి తక్కువ నామినల్ రుసుముతో డ్రైవర్లు ఈ ప్లాట్‌ఫాంలో పనిచేయవచ్చని తెలిపింది.

# కొత్త డిస్కమ్ ఏర్పాటుకు ఆమోదం

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


**హైదరాబాద్, డిసెంబర్ 17:** విద్యుత్‌శాఖలో మరో విద్యుత్ పంపిణీ సంస్థ డిస్కంను ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మూడో డిస్కమ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను బుధవారం విడుదల చేసింది. వ్యవసాయానికి, పేదల గృహాలకు 200 యూనిట్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల నిర్వహణ, అలాగే ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడం ఈ డిస్కం ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే ఉన్న తెలంగాణ సదరన్, నార్తర్న్ డిస్కమ్‌లతో పాటు ఈ కొత్త డిస్కం పని చేయనుంది. దీనివల్ల విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్థిక స్థిరత్వం, సంక్షేమ పథకాల అమలును మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త డిస్కమ్ ఏర్పాటుపై గతంలోనే కేబినేట్‌లో నిర్ణయించారు. దీనిద్వారా విద్యుత్ వినియోగాన్ని లెక్క కట్టాలని చూస్తున్నట్లు



సంపాదకీయం

# ఆందోళనకరంగా రూపాయి పతనం!

రోజురోజుకూ రూపాయి పతనం ఆందోళన కలిగిస్తోంది. అదేపనిగా దిగుమతులు పెంచుకోవడం, ఎగుమతులు తగ్గడం వంటి కారాణాలకు తోడు అంతర్జీతాయ పరిణామాల నేపథ్యంలో రూపాయి దిగజారుతోంది. ప్రపంచ మార్కెట్లో మన వస్తువుల ఉత్పత్తులు పెరిగితేనే మన విదేశీ మారక నిల్వలు పెరగడంతో పాటు, రూపాయి బలపడగలదు. అయితే గత దశాబ్దకాలంతో పోలిస్తే రూపాయి విలువ వందశాతం పడిపోయింది. ఇప్పుడు డాలర్‌తో పోలిస్తే 91 రూపాయలకు చేరింది. ఇది మనకు గుదిబండగా మారినా పెద్దగా స్పందన రావడం లేదు. ఆర్థికవేత్తలు, ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా దృష్టి సారించడం లేదా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి యధేచ్ఛగా దిగజారుతూనే ఉంది. మంగళవారం డాలర్ మారకంలో రూపాయి విలువ మరో 15 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 90.93 వద్ద స్థిరపడింది. అంతకు ముందు ఇంట్రాడేలో 36 పైసలు క్షీణించి జీవితకాల కనిష్ఠ స్థాయి 91.14 వరకు కూడా దిగజారింది. కేవలం 10 ట్రేడింగ్ సెషన్లలోనే డాలర్ మారకం లో రూపాయి 90 నుంచి 91 స్థాయికి పడిపోయింది. కేవలం ఐదు సెషన్లలోనే 1 శాతం మేరకు నష్టపోయింది. డాలర్ బలహీనత, క్రూడాయిల్ ధరల తగ్గుదల సైతం రూపాయి పతనాన్ని నిలువరించలేకపోయాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.54 శాతం దిగజారి 59.63 డాలర్లకు దిగివచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నెలలోనే రూపాయి 92 కన్నా దిగజారవచ్చని ఫారెక్స్ ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారత్ చేసిన కొత్త ప్రతిపాదనలను స్వీకరించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించలేదన్న వార్తలు రూపాయి మారకాన్ని ప్రభావితం చేశాయని ఫారెక్స్ ట్రేడర్లంటున్నారు. సరికొత్త ప్రతిపాదనలను భారత్ ఖరారు చేసే వరకు డీల్ నిలిచిపోయినట్టే అన్న భయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశా యి. మరోపక్క రూపాయి పతనాన్ని నిలువరించేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోవడం వల్ల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిధులు ఉపసంహరించడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టయింది.ఇదిలా ఉండగా 2027 జూన్ నాటికి రూపాయి 92-94 స్థాయికి దిగజారవచ్చని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ నీలకంఠ్ మిశ్రా అంచనా వేస్తున్నారు. అయితే రూపాయి ఎంత దిగజారినా మనం భయపడాల్సిందేమీ లేదన్నది ఆయన అభిప్రాయంగా ఉంది. మనం 68,500-69,000 కోట్ల డాలర్ల భారీ విదేశీ మారకపు నిల్వలతో అత్యంత శక్తివంతంగా ఉన్నామని ఆయన అన్నారు. ఈ ఏడాది డిసెంబరు 3వ తేదీ వరకు రూపాయి విలువ 5.1 క్షీణించిందని కేంద్రమంత్రి పంకజ్ వెల్లడించారు. రూపాయి విలువ ఇంతగా పడిపోవడానికి వాణిజ్య లోటే కారణమని ప్రభుత్వం చెబుతోంది. రూపాయి నిరంతర పతనం అంశాన్ని కొందరు సభ్యులు రాజ్యసభలో ప్రస్తావించగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదురి ఈ ప్రకటన చేశారు. ఈ ఏడాది రూపాయి విలువను వాణిజ్య లోటు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రభావితం చేశాయని మంత్రి చెప్పారు. రూపాయి విలువ క్షీణత వల్ల ఎగుమతి రంగం పోటీ సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు. ఇదే సమయంలో దిగుమతుల విలువ పెరగవచ్చని కూడా ఆయన అంగీకరించారు. రూపాయి విలువను మార్కెట్ నిర్ణయిస్తుందని, దానికి ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించలేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే రూపాయి కదలికలను ఆర్‌బీఐ నిరంతరం ట్రాక్ చేస్తున్నదని, ఆటుపోట్లు తీవ్రంగా ఉంటే అవసరమైన మేరకు జోక్యం చేసుకుంటుందని ఆయన చెప్పారు. అయితే డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ మరింత క్షీణించే అవకాశం ఉందని, అయితే దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొందరు వాదిస్తున్నారు. ఫార్వర్డ్స్ మార్కెట్‌లో ఆర్‌బీఐ జోక్యం వల్ల సమస్య వస్తోందని, ఇంతకు ముందు రూపాయిని ఒక స్థాయికి కట్టడి చేయడం ఒక తప్పిదమని పేర్కొన్నారు. గతంలో చేసిన తప్పిదాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయని తెలిపారు. ఇకపోతే ఇటీవలి కాలంలో అమెరికా తనకు గిట్టని దేశాలపై డాలర్‌తో బాదుతోంది. రష్యా, ఇరాన్, వెనెజువెలా దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించింది. డాలర్లు చిక్కకుండా చేసి, వాటి వ్యాపారాన్ని దెబ్బతీసింది. ఆ దేశాలను ప్రపంచ వాణిజ్యం నుంచి బయటికి పంపడానికి ఇదంతా చేసింది. రేపు తమకూ ఇలాంటి పరిస్థితే తలెత్తితే ఎలాగని ఇతర దేశాల్లో ఆందోళనతో కూడిన అనుమానం మొదలైంది. ఫలితంగా, డాలర్ మీద ఆధారపడటం తగ్గించి కొత్త మార్గాల్లో వాణిజ్యం చేసే ప్రయత్నం ఊపందుకొంటోంది. రష్యా కూడా చైనా, భారత్, కొన్ని ఆఫ్రికన్ దేశాల కరెన్సీలు, రూబుల్లలో వ్యాపారం చేస్తోంది. భారత్ 30 దేశాలతో రూపాయితో జమలు, చెల్లింపులకు ఖాతాలు తెరచింది. అయితే రష్యాకు భారత్ చేసే ఎగుమతులకన్నా దిగుమతులే ఎక్కువ కావడంతో మన రూపాయలు రష్యన్ బ్యాంకుల్లో పేరుకుపోతున్నాయి. రష్యా భారత్ నుంచి ఎక్కువ దిగుమతులు చేసుకుంటే అవి ఖర్చయ్యేవి. కాకపోతే, ఆ రూపాయలతో భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉండటంతో, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్ ఇతర దేశాలతో రూపాయలు, స్థానిక కరెన్సీల్లో వ్యాపారం మొదలుపెట్టింది. సింగపూర్, యుఏఈ, నేపాల్, భూటాన్‌లలో యూపీఐ చెల్లింపులు ఊపందుకుంటున్నాయి. ఒక్కసారిగా డాలర్లకు దూరం జరిగితే చమురు, ఇతర దిగుమతుల ధరలు పెరిగిపోయి సామాన్యులు ద్రవ్యోల్బణం బారిన పడతారు. అందుకే డాలర్ ఆధిపత్యాన్ని క్రమక్రమంగా వదిలించుకోవాలని ప్రపంచ దేశాలు చూస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా బలమైన వాణిజ్యం దిశగా అడుగులు వేయాల్సి ఉంది. అంతకుముందే రూపాయిని బలోపేతం చేసుకుంటే మంచిది. ప్రపంచంలో ఇప్పటికీ 47శాతం లావాదేవీలకు డాలర్లనే ఉపయోగిస్తున్నారు. అందుకని, మరికొంత కాలం డాలర్ ఆధిపత్యం కొనసాగవచ్చు. ఆ తరవాత కూడా డాలర్ స్థానాన్ని ఏ ఒక్క దేశ కరెన్సీ ఆక్రమించకపోవచ్చు. స్థానిక కరెన్సీలు, డిజిటల్ కరెన్సీలు, బంగారం వాడకం పెరగవచ్చు.



# ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం

## ఇథియోపియా దేశ అత్యున్నత పురస్కారం ప్రదానం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇథియోపియా దేశ అత్యున్నత పురస్కారం వరించింది. అదిస్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆ దేశ ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ.. 'ది గ్రేట్ ఆనర్ ఆఫ్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా' అవార్డుతో మోదీని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారతీయులందరి తరఫునా ఈ అవార్డు స్వీకరిస్తున్నానన్నారు. భారత్-ఇథియోపియా బంధాలను పటిష్ఠం చేసేందుకు సహకరించిన ఎందరో భారతీయులకు ఇది గుర్తింపు అభివర్ణించిన మోదీ.. ఆ దేశ ప్రధాని అబీ అహ్మద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. మోదీ.. తన తొలి ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా ఇథియోపియా రాజధాని అదిస్ అబాబా చేరుకున్నారు. అంతకముందు.. విమానాశ్రయంలో ఆయనకు అబీ అహ్మద్ అలీ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రధానుల మధ్య పరస్పర ప్రయోజనకర విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ధియోపియాకు వెళ్లడానికి ముందు జోర్డాన్ దేశంలో పర్యటించారు మోదీ. ఆ దేశ రాజధాని అమ్మాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. రానున్న ఐదేళ్లలో భారత్-జోర్డాన్ ద్వైపాక్షిక వాణిజ్య బంధాన్ని రెట్టింపు చేసి 500 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకునేలా ప్రయత్నం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యం వహించి లబ్ది పొందాలని ఆ దేశ వాణిజ్య సంస్థలను కోరారు మోదీ. ఈ కార్యక్రమంలో ఆ దేశ యువరాజు హుసేన్ సహా వాణిజ్య, పరిశ్రమల శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

# ఆధార్ డేటా సురక్షితం

## పార్లమెంటులో కేంద్రమంత్రి వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ డేటా బేస్ నుంచి ఆధార్‌కార్డు హోల్డర్ల డేటా దుర్వినియోగం జరగలేదని కేంద్రం స్పష్టంచేసింది. ఆధార్ డేటా బదిలీ, స్టోరేజీ సమయంలో అధునాతన ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. నేషనల్ క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొటెక్షన్ సెంటర్ పర్యవేక్షణలో ఆధార్ వ్యవస్థ సురక్షితంగా ఉందని తెలిపారు. అధునాతన భద్రతా చర్యల కారణంగా పౌరుల ఆధార్ డేటా సురక్షితంగా ఉందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఉడాయ్‌లో సుమారు 134 కోట్ల మంది ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 16వేల కోట్ల అథంటికేషన్ లావాదేవీలు జరిగాయని కేంద్రమంత్రి తన సమాధానంలో వెల్లడించారు. బలమైన సాంకేతిక, సంస్థాగత భద్రతా చర్యల కారణంగా ఆధార్ డేటా సురక్షితంగా ఉందని తెలిపారు. ఆధార్ డేటా భద్రతకు ఉడాయ్.. డిఫెన్స్- ఇన్- డెప్త్ విధానాన్ని అనుసరిస్తూ బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. ఇందులో ఒక లేయర్ దెబ్బతిన్నా.. మిగిలినవి డేటాకు రక్షణ కల్పిస్తాయని చెప్పారు. ఇది ఎప్పటికప్పుడు ఆధార్ సైబర్ సెక్యూరిటీకి సంబంధించి సూచనలు చేస్తుంటుందని పేర్కొన్నారు. దీనికితోడు స్వతంత్ర ఆడిట్ ఏజెన్సీలు కూడా ఆధార్ ఎకోసిస్టమ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

# ఢిల్లీ కాలుష్యంపై మరోమారు సుప్రీం సీరియస్

## టోల్ ప్లాజాలు మూసేయాలని ఆదేశం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం ముప్పు తిప్పలు పెడుతోంది. స్వచ్ఛమైన గాలి లేక నరకయాతన పడుతున్నారు. బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. నగర వాసులు ఆందోళనలు చేపడుతున్నారు. ఇంకోవైపు పార్లమెంట్ వేదికగా విపక్ష నాయకులు కూడా పోరాటం చేస్తున్నారు. అయినా కూడా సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. తాజాగా ఈ వ్యవహారంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా సీరియస్ అయింది. కాలుష్యాన్ని నియంత్రించడానికి అధికారులు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు పూర్తిగా విఫలమయ్యాయంటూ మందలించింది. టోల్ ప్లాజాల దగ్గర ట్రాఫిక్ రద్దీ, పెరుగుతున్న వాయు కాలుష్యానికి తీవ్రమైన ఆందోళన కలిగించే అంశాలుగా పేర్కొంది. తక్షణమే టోల్ ప్లాజాలను మూసేయాలని ఆదేశించింది. తాత్కాలిక నష్టాలను పౌర సంస్థతో భర్తీ చేసుకోవచ్చని సూచించింది. కాలుష్య నియంత్రణ కోసం తాత్కాలిక లేదా స్వల్ప కాలిక చర్యలు కాకుండా దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం అని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వం పాఠశాలలను మూసివేయడం, ఆన్‌లైన్ తరగతులను అనుమతించడంపై సవాళ్లు సహా పిల్లలపై కాలుష్యం ప్రభావంపై దాఖలైన పిటిషన్లను విచారించిన కోర్టు.. జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఇటువంటి చర్యలు తాత్కాలిక ఉపశమనం కల్పించడానికి ఉద్దేశించిన మధ్యంతర విధాన నిర్ణయాలు అని పేర్కొంది. శీతాకాలంలో పాఠశాలలు 10 నుంచి 15 రోజులు మూసివేయబడతాయని ధర్మాసనం తెలిపింది. ఏ కారణంతోనైనా ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి మాట్లాడుతూ.. పాత వాహనాలు కాలుష్య స్థాయిలను మరింత దిగజారుస్తున్నాయని తెలిపారు.

# రాజధాని కాలుష్యంపై ఆందోళన

## 50శాతం వర్క్ ఫ్రమ్ హోమ్‌కు సర్కార్ ఆదేశం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుని అల్లాడిపోతోంది. శీతాకాలం కావడంతో ఢిల్లీలో వాయు కాలుష్య సంక్షోభం తలెత్తింది. గత కొన్ని రోజులుగా వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయిలో నమోదవుతోంది. ఏక్యూఐ లెవెల్స్ 400కిపైనే నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు పలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య కట్టడికి ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఇప్పటికే పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని అన్ని సంస్థలకు 50శాతం వర్క్ ఫ్రమ్ హోమ్‌ను తప్పనిసరి చేసింది. ఢిల్లీ ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తప్పనిసరిగా 50 శాతం వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలో పనిచేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తామని కూడా హెచ్చరించింది. అంతేకాదు, కాలుష్య నిరోధక ఆంక్షల కారణంగా పని కోల్పోయిన రిజిస్టర్డ్ నిర్మాణ కార్మికులకు రూ. 10,000 పరిహారం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాజధాని ఢిల్లీలో కాలుష్యం కట్టడిపై అక్కడి ట్రిపుల్ ఇంజిన్ సర్కారు చేతులెత్తేసింది. రోజురోజుకూ దిగజారుతున్న కాలుష్య ప్రమాణాలపై బీజేపీ మంత్రి మంజీందర్ సింగ్ మంగళవారం ప్రజలకు క్షమాపణ చెప్పారు. కాలుష్య కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని అంగీకరించిన ఆయన, ఆ తప్పునకు మాత్రం మునుపటి ఆప్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కేవలం 9,10 నెలల్లో కాలుష్య స్థాయిని తగ్గించడం సాధ్యం కాదన్నారు. ఢిల్లీలో కాలుష్యం నేపథ్యంలో ఇక నుంచి పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్‌ని చూపిన వాహనదారులకే ఇంధనం నింపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# బంగ్లా నేత ప్రేలాపనలు

## రెచ్చగొట్టే వ్యాఖ్యలపై భారత్ ఆగ్రహం ● బంగ్లా హైకమిషనర్‌కు సమన్లు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** ఈశాన్య రాష్ట్రాలపై బంగ్లాదేశ్ నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు హస్నాత్ అబ్దుల్లా ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంపై భారత్ చర్యలకు ఉపక్రమించింది. బంగ్లాను అస్థిరపరిస్తే.. సెవన్ సిస్టర్స్(7 ఈశాన్య రాష్ట్రాలు)ను ముక్కలు చేస్తామని హస్నాత్ అబ్దుల్లా బహిరంగంగా హెచ్చరించారు . ఈ విషయమై ఆ దేశ హైకమిషనర్ మహ్మద్ రియాజ్ హమీదుల్లాకు భారత్ సమన్లు జారీ చేసింది. బంగ్లాదేశ్‌లోని భారత దౌత్య కార్యాలయానికి బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. బంగ్లాదేశ్‌లో భద్రతా పరిస్థితులు క్షీణించడంపై హమీదుల్లా ముందు ఆందోళన వ్యక్తం చేసింది భారత విదేశాంగ శాఖ. ఢాకాలోని ఇండియన్ ఎంబస్సీపై బంగ్లాదేశీయులు బెదిరింపులకు పాల్పడటాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. బంగ్లాలో ఇటీవల జరిగిన సంఘటనలకు సంబంధించి ఇండియాపై తప్పుడు కథనాలను పూర్తిగా తిరిస్కరిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈ ఘటనలకు సంబంధించి తాత్కాలిక ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు నిర్వహించకపోవడం లేదా సరైన ఆధారాలను పంచుకోకపోవడం దురదృష్టకరమని భావిస్తూ అసంతృప్తి వ్యక్తం చేసింది. భారత్.. బంగ్లాదేశ్‌తో సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. ఆ దేశంతో శాంతి, స్థిరత్వాన్ని కోరుకుంటున్నామని.. శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని పిలుపునిచ్చినట్టు గుర్తు చేసింది. తాత్కాలిక ప్రభుత్వం తన దౌత్య బాధ్యతలకనుగుణంగా బంగ్లాలోని భారత మిషన్లు, పోస్టుల భద్రతను నిర్ధారించాలని ఆశిస్తున్నట్టు స్పష్టం చేసింది ఇండియా. కాగా.. గతేడాది విద్యార్థుల ఆందోళన తర్వాత బంగ్లాదేశ్ ప్రధానిగా ఉన్న షేక్ హసీనా రాజీనామా చేశారు. నాటి నుంచి భారత్- బంగ్లా సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారత్‌కు వ్యతిరేకంగా అక్కడి నాయకులు పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే.. వీటిని ఎప్పటికప్పుడు భారత్ ఖండిస్తూనే ఉంది.



# ఆపరేషన్ సిందూర్‌పై మహారాష్ట్ర మాజీ సీఎం వివాదాస్పద వ్యాఖ్యలు

## క్షమాపణలు చెప్పేది లేదని ప్రకటన

**ముంబై, డిసెంబర్ 17 :** ఆపరేషన్ సిందూర్‌పై మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్ వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అయితే తాను క్షమాపణలు చెప్పేది లేదని ఆయన ప్రకటించారు. పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేసిన ఆపరేషన్ సిందూర్ గురించి మహారాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. పుణెలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో చవాన్ మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ మొదటి రోజే భారత్ యుద్ధ విమానాలను పాక్ కూల్చేసిందని సంచలన కామెంట్స్ చేశారు. తాజాగా తన వ్యాఖ్యలను ఆయన సమర్థించుకున్నారు. తన వ్యాఖ్యల్లో తప్పేమీ లేదని తేల్చి చెప్పారు. దీంతో, బీజేపీ నేతలు ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చవాన్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ క్రమంలో తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ క్షమాపణలు చెప్పేది లేదని స్పష్టం చేశారు. పుణెలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ గురించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇవికాస్త రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. దీనిపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ మాట్లాడుతూ.. పృథ్వీరాజ్ చవాన్ పాకిస్థాన్ ప్రతినిధిలా మాట్లాడుతున్నారని విమర్శించారు. విజయ్ దివస్ నాడు మన సాయుధ దళాలను ఉద్దేశపూర్వకంగా దూషించి, వారిని రద్దు చేయాలంటూ వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చవాన్ వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలు ఎందుకు ఖండించలేదని, ఆయనపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సైన్యంపై గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు మందలించిన విషయాన్ని ప్రస్తావించారు. చవాన్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భాజపా రాజ్యసభ ఎంపీ బ్రిజ్‌లాల్ కూడా చవాన్ వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ ఎప్పుడూ పాక్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తూ.. భారత్‌ను అవమానిస్తుందని విరుచుకుపడ్డారు. ఇక, బీజేపీ నేతల ప్రతిస్పందనల క్రమంలో చవాన్ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. 'ఇప్పుడు దీని గురించి నేను ఇంకేమీ చెప్పాలనుకోవడం లేదు. కానీ నేను ఎలాంటి క్షమాపణ చెప్పను. దాని అవసరం లేదు. నేను ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని విలేకరులతో అన్నారు.



# ఆ ఇద్దరూ తగ్గట్లే!

- కోరుట్లలో 'హాట్ టాపిక్'గా మారిన ఓ భూ వివాదం
- అనుమతి రద్దు నుంచి.. మానవ హక్కుల ఆశ్రయం వరకు
- బయానా.. వీఎల్టీ.. కోర్టు మెట్లు.. సీసీ కెమెరాల చోరీ.. ఠాణా.. మున్సిపల్.. జేసీబీ ఎంట్రీలన్నీ వివాదాలే!
- ఈ 'భూపంచాయతీ'పై 'నేటి సాక్షి' ప్రత్యేక కథనం

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**

**కోరుట్ల పట్టణంలో ఒక చిన్న 'భూ-పంచాయతీ' విషయంలో 'ఆ-ఇద్దరు' ధనవంతులు ఎవ్వరూ 'తగ్గట్లే'దు.! కూర్చుని మాట్లాడుకుని..ఇద్దరూ సయోధ్య కుదుర్చుకుంటే ఒడిసిపోయే ఈ చిన్న పంచాయతీ 'చినికి చినికి గాలివానగా' మారుతోంది. ఆ భూమి నేను కొనుక్కున్నాంటే..నేను కొనుక్కున్నాంటు ఆ ఇద్దరూ 'యాజమాన్య డాక్యుమెంట్లు' కలిగివున్నమని పేర్కొంటున్నారు. ఒకరు అనుమతి కోసం వెళితే..మరొకరు రద్దు కోసం వెళుతున్నారు. ఒకరు ఠాణా మెట్లెక్కితే..మరొకరు కోర్టు మెట్లెక్కుతున్నారు.ఒకరు మున్సిపల్ కమిషనర్ తో కూల్చివేతలకు స్కెచ్ వేస్తే..మరొకరు మానవ హక్కుల తలుపుతట్టుకుంటూ వివాదానికి మరిన్ని చిక్కుముడులు వేసుకుంటున్నారు.**





## వివాదం ఇలా మొదలై..

భవన నిర్మాణ అనుమతి రద్దు అంశంతో మొదలైన ఒక సాధారణ వివాదం, క్రమంగా భూ హక్కుల పోరాటం, న్యాయస్థానాల ఇంజంక్షన్ ఉత్తర్వులు, పోలీసు శాఖపై నిర్వాక ఆరోపణలు, మున్సిపాలిటీ నోటీసులు మరియు తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ జోక్యం వరకు విస్తరించడంతో కోరుట్ల పట్టణంలో తీవ్రమైన చర్చలకు దారి తీసింది.! సర్వే నంబర్లు 1233 మరియు 1375కు సంబంధించిన ఈ వ్యవహారం, చట్టపరమైన సంక్లిష్టతలు, అధికారిక ఉత్తర్వులు మరియు ఫిర్యాదులతో నిండి, తెలంగాణలో భూ వివాదాల బహుముఖ స్వభావాన్ని ప్రతిబింబిస్తోంది. తెలంగాణలో భూ వివాదాలు సాధారణంగా అస్పష్టమైన భూ రికార్డులు, వారసత్వ విభేదాలు, అక్రమ కబ్జాలు మరియు వేగవంతమైన నగరీకరణ కారణంగా ఏర్పడుతాయి.మరియు ఇటువంటి వివాదాలు న్యాయస్థానాల్లో దీర్ఘకాలం పెండింగ్‌లో ఉండటం వల్ల సమస్యలు మరింత తీవ్రమవుతాయని మరోసారి స్పష్టం చేసింది.!

## సీసీ కెమెరాల చోరీ కథ వెనుక ఇదే వివాదమా.?

తన భూమిని ఎవరూ కబ్జా చేయకూడదని తోట గంగాధర్ తాను కిరాయికిచ్చిన షాపు వద్ద ఖరీదైన సీసీ కెమెరాలను అమర్చుకున్నారు. కాగా, రెండు సార్లు ఆ సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు ఇంకా ఎఫ్ఐఆర్ కూడా చేయలేదని గంగాధర్ ఆరోపిస్తున్నారు. ఎందుకు ఇంకా దొంగలను పట్టుకోలేదని.. కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఉండడం వెనుక ఎవరైనా ఒత్తిడి చేస్తున్నారాని గంగాధర్ ప్రశ్నిస్తున్నారు.



## ఇదీ వివాదానికి కారణం.?

కోరుట్ల పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ విభాగం, 31-01-2024న జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా సర్వే నంబర్ 1233లో యండి సల్మాన్ (తండ్రి: అబ్దుల్ ఖాలీక్)కు ఇచ్చిన భవన నిర్మాణ అనుమతిని రద్దు చేసింది. ఈ నిర్ణయానికి ముఖ్య కారణాలుగా, 28-07-2023న ఆర్మూర్ శంకర్ చేసిన ఫిర్యాదు, అలాగే హైకోర్టు మరియు సివిల్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులు - O.S.No. 13/2002, A.S.No.218/2007, W.P.No.37722/2018, W.P.No%.3996/2021 వంటివి - పేర్కొనబడ్డాయి. ఈ కేసుల్లో వచ్చిన ఉత్తర్వులు వివాదానికి కీలకమైనవిగా మారాయంటున్నారు.అయితే.. కోరుట్ల పట్టణానికి చెందిన తనతోపాటు పడాల నారాయణ,మంగళి దేవయ్యలు ఈ వివాదాస్పద భూమికి యజమానులమని తోట గంగాధర్ పేర్కొంటున్నారు. కాగా..శీలం వేణు గోపాల్‌కు తోట గంగాధర్‌తో మరికొన్ని భూవివాదాల్లో 'పంచాయతీ'లుండడంతో పడాల నారాయణ, మంగళి దేవయ్య ఈ భూమి హక్కుల నుంచి తప్పుకుంటూ తమవంతు పెట్టుబడిని వెనక్కి తీసుకుని తోట గంగాధర్‌ను ఆ భూమికి యాజమాన్య హక్కులు కల్పించినట్టు గంగాధర్ పేర్కొంటున్నారు. ఐతే.! ఆ భూమి తనదని..తనకే సర్వ హక్కులు ఉన్నాయని శీలం వేణుగోపాల్ ఎంట్రీ ఇచ్చి వివెల్టీ కూడా కడుతున్నట్టు చూపించాడు. ఇదే భూమిని తాను పడాల నారాయణ, మంగళి దేవయ్యలకు బయానగా రూ.5 లక్షలు ఇచ్చినట్టు శీలం వేణుగోపాల్ పేర్కొనడంతో వివాదానికి విత్తనం వేసినట్టైంది.

## భూ-హక్కుల పోరు: కోర్టు ఇంజంక్షన్ ఉత్తర్వులు

ఈ నేపథ్యంలో..తోట గంగాధర్ సర్వే నంబర్ 1375లో తన భూమిపై యాజమాన్య హక్కులు తనవేనని బహిరంగంగా ప్రకటిస్తూ తన స్థలంలో ఓ బోర్డును కూడా పెట్టుకున్నారు. ఈ భూమి హక్కుల పరిరక్షణ కోసం ఆయన దాఖలు చేసిన O.S.No.162/2025 కేసులో, 04-12-2025న జూనియర్ సివిల్ జడ్జి, కోరుట్ల ఇచ్చిన I.A.No.518/2025 ఉత్తర్వుల ద్వారా శీలం వేణుగోపాల్ లేదా ఇతరులు తన భూమిలో జోక్యం చేసుకోకుండా ఇంజంక్షన్ జారీ చేయబడింది.

## మానవ హక్కుల కమిషన్ జోక్యం

పోలీసులు తన ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో తన జీవితం మరియు ఆస్తి ప్రమాదంలో పడిందని పేర్కొంటూ, తోట గంగాధర్ తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ ఈ ఫిర్యాదును స్వీకరించి, డైరీ నంబర్ 1506/IN/2025 కేటాయించింది. జీవన హక్కు (ఆర్టికల్ 21), ఆస్తి హక్కు (ఆర్టికల్ 300-ఏ) ఉల్లంఘనలపై విచారణ జరపాలని ఆయన కోరారు. తెలంగాణ మానవ హక్కుల కమిషన్ భూ వివాదాలలో మానవ హక్కుల ఉల్లంఘనలపై మాత్రమే జోక్యం చేసుకోవాలి, కానీ యాజమాన్యం లేదా కబ్జా వివాదాలను తీర్పు చెప్పే అధికారం లేదని తెలంగాణ హైకోర్టు ఇటీవలి తీర్పుల్లో స్పష్టం చేసింది. అయినప్పటికీ, పోలీసు హరాస్‌మెంట్ లేదా నిర్వాకం వంటి కేసుల్లో కమిషన్ విచారణ చేపట్టి, నివేదికలు కోరుతుంది.

## మున్సిపాలిటీ నోటీసు.. గంగాధర్ ప్రతిస్పందన

09-12-2025న కోరుట్ల మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం, శీలం వేణుగోపాల్ ఫిర్యాదు ఆధారంగా తోట గంగాధర్‌కు నోటీసు జారీ చేసింది. సైట్ పరిశీలనలో విషయం కోర్టులో పెండింగ్‌లో ఉందని, ఇంజంక్షన్ ఉత్తర్వులు ఉన్నప్పటికీ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని, లేకుంటే తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం-2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దీనికి ప్రతిస్పందనగా, 12-12-2025న గంగాధర్ మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాశారు. తాను శాశ్వత భవనాలు లేదా ఆర్‌సీసీ నిర్మాణాలు చేయడం లేదని, కేవలం పందులు, వీధి జంతువులు, భూకబ్జాదారుల నుంచి రక్షణ కోసం గేట్‌తో కూడిన కంపౌండ్ వాల్ మాత్రమే ఏర్పాటు చేస్తున్నానని స్పష్టం చేశారు. ఇది మున్సిపల్ చట్టానికి విరుద్ధం కాదని, హైకోర్టు తీర్పులను ఉదహరించారు. అలాగే, తనపై వచ్చిన ఫిర్యాదు ప్రతులు, అనుబంధ పత్రాల సర్టిఫైడ్ కాపీలు అందజేయాలని కోరారు.



## మళ్లీ జేసీబీతో వచ్చిన మున్సిపల్ అధికారులు


మున్సిపాలిటీ అధికారుల అనుమతి లేకుండా భవన నిర్మాణం చేపడుతున్నారన్న ఫిర్యాదు మేరకు సోమవారం మళ్లీ మున్సిపల్ పట్టణ ప్లానింగ్ విభాగం జెసిబీతో కూల్చివేసేందుకు రావడంతో రగడ మొదలైంది.తమకు ఇంజంక్షన్ ఆర్డర్ ఉందని తెలిసీ ఎందుకు కూల్చివేస్తున్నట్టు తోట గంగాధర్ మున్సిపల్ అధికారులను నిలదీశారు.తమను మున్సిపల్ కమిషనర్ ఆదేశించినందున వచ్చామని పేర్కొనడంతో.. పంచాయతీ కమీషనర్ కార్యాలయానికి చేరింది.

## మా ఇష్టం.. ఫిర్యాదు వచ్చింది.. కూల్చేస్తాం

యాజమాన్య హక్కు పత్రాలు.. సీసీ కెమెరాల చోరీ ఫిర్యాదు పత్రాలు.. మున్సిపల్ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు పత్రాలు..కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఆర్డర్ ప్రతులు.. మానవహక్కుల కమిషన్ కు ఇచ్చిన నివేదిక ప్రతులు అన్నీ చూపించినా మున్సిపల్ కమీషనర్ రవిందర్ తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అని వితండవాదానికి దిగిన వైనం పలు అనుమానాలకు తావిచ్చిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అసలు మీకు ఎవరు ఫిర్యాదు చేశారో బహిర్గతం చేయమంటే..మేం చెప్పం.. చెప్పాల్సిన అవసరం మాకు లేదు..ఏ పత్రాలు మేం చూడం..మా మున్సిపల్ చట్టాల ప్రకారమే మేం నడుచుకుంటున్నామని కమీషనర్ రవిందర్ ఖరాఖండిగా చెప్పడం వెనుక బలమైన వారెవరో ఒత్తిడి చేస్తున్నారాని గంగాధర్ ఆరోపిస్తున్నారు.ఆఖరికి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న కూడా మేం సమాధానం ఇవ్వడం కుదరదని పేర్కొనడం..ఈ వివాదం ఇంకా ముదిరి ఎటు దారితీస్తోందోనని పలువురు ముచ్చటించుకుంటున్నారు.

## 'ఆ-ఇద్దరి' లడాయి మధ్యలో 'ఈ-రెండు' శాఖలు బలి


'తోట గంగాధర్ - శీలం వేణుగోపాల్'ల మధ్య రాజుకున్న 'చిన్న భూ పంచాయతీ' లడాయి వ్యవహారంలో పోలీసు అధికారులు.. మున్సిపల్ అధికారులు ఏం చెప్పలేక..ఏం చేయలేక నలిగిపోతున్నారు. కరవమంటే కప్పకు కోపం-వదలమంటే పాముకు కోపం అన్నట్టు తయారైంది మా పరిస్థితి అంటున్నారు..పేరు చెప్పుకొని అధికారులు.ఈ వ్యవహారం మొత్తం లోతైన సంక్లిష్టత మరియు భవిష్యత్ ప్రభావాలు భవన అనుమతి రద్దు, భూ వివాదంపై కోర్టు ఉత్తర్వులు, పోలీసు నిర్వాకంపై ఆరోపణలు, మానవ హక్కుల కమిషన్ జోక్యం మరియు మున్సిపల్ నోటీసులు - ఈ పరిణామాలన్నీ కోరుట్లలోని భూ వివాదం ఎంత లోతుగా మరియు చట్టపరంగా సంక్లిష్టంగా మారిందో సూచిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం "భూ భారతి చట్టం-2025" ద్వారా భూ వివాదాలను జిల్లా స్థాయిలో పరిష్కరించే కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టింది.ఇది ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ (ఏడీఆర్) పద్ధతుల ద్వారా వేగవంతమైన పరిష్కారాలను అందిస్తుంది. ఇకపై కోర్టులు, మున్సిపాలిట, పోలీసు శాఖలు తీసుకునే నిర్ణయాలపై స్థానికులలో ఉత్కంఠ నెలకొంది. ఇటువంటి వివాదాలు సమాజంలో శాంతి మరియు అభివృద్ధిని ప్రభావితం చేస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.



నేటి సాక్షి
కరీంనగర్ | గురువారం 18 డిసెంబర్ 2025



# రూ.6000 కోట్లు 'ఆంబుక్క'!




## 2022-23 ఖరీఫ్ సీజన్ సీఎమ్మార్ మాయం

## ఒక్క జగిత్యాల జిల్లాలోనే రూ.225.27 కోట్లు స్వాహా

### విజిలెన్స్-ఎన్ఫోర్స్ మెంట్ అధికారుల తనిఖీల్లో నిల్వలు లేవని నివేదికలిచ్చినా 'స్వాహా-రైస్ మిల్లర్ల'పై చర్యలు శూన్యం

- మొక్కుబడిగా 'కొందరి'పై మాత్రమే కేసుల నమోదు
- కోట్ల రూపాయల సిఎమ్మార్ బుక్కిన వారికే మళ్లీ మళ్లీ ధాన్యం కేటాయింపులు ఎందుకు.?
- ఇందులో 'మర్మం' ఏంటో? వీరిని కాపాడుతూ 'గల్లపెట్టెలు' నింపుకుంటున్న 'నేతలు-అధికారులు'
- అదే దొంగ రైస్ మిల్లర్లకు ప్రతీ సీజన్లో కేటాయిస్తున్నట్టే..తమకూ సిఎమ్మార్ కేటాయిస్తే పెండింగ్ బకాయిలు చెల్లిస్తామంటున్న 'కేసుల బాధిత రైస్ మిల్లర్లు'
- అప్పుడు 'దొడ్డు వడ్లు' సిఎమ్మార్' కేటాయించి-ఇప్పుడు 'సన్న బియ్యం' అడుగుతున్న వైనం.!
- 'రైస్ మిల్లర్ల లాబీయింగ్' పై 'నేటి సాక్షి' ప్రత్యేక కథనం

**కడుపునిండా సిఎమ్మార్ బియ్యం బుక్కిన 'దొంగ రైస్ మిల్లర్లకే' మళ్లీ మళ్లీ సద్దిగడుతోంది ప్రస్తుత ప్రభుత్వం.! తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి చెందిన కస్టమ్ మిల్డ్ రైస్ (జవీ=) బియ్యాన్ని పక్కదారి పట్టించి, ఓపెన్ మార్కెట్లో అమ్మేసి కోట్ల రూపాయల మోసం చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చినా.. ఎలాంటి చర్యలు తీసుకోకుండా 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహారించడం వెనుక ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా 2022-23 ఖరీఫ్ మరియు రబీ సీజన్లలో ఈ అక్రమాలు ఎక్కువగా జరిగాయి. ప్రభుత్వం రైతుల నుంచి కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేసి, మిల్లర్లకు మిల్లింగ్ కోసం అప్పగిస్తుంది. వారు బియ్యంగా మార్చి ప్రభుత్వానికి (ఎఫ్‌సీఐ లేదా పౌర సరఫరాల శాఖకు) తిరిగి ఇవ్వాలి. కానీ చాలామంది మిల్లర్లు ఈ బియ్యాన్ని లేదా ధాన్యాన్ని పక్కదారి పట్టించి, నల్లమార్కెట్లో అమ్మేసి లాభపడ్డారు.2022-23 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 43.73 లక్షల టన్నుల %జవీ=% బియ్యం అప్పగించాల్సి ఉండగా, మిల్లర్లు దీన్ని జాప్యం చేసి పక్కదారి పట్టించారు.ఆ ఒక్క సీజన్లోనే దాదాపు రూ.6000 కోట్ల సిఎమ్మార్ ను 'ఆంబుక్క' పెట్టేశారు. ఒక్క జగిత్యాల జిల్లాలోనే రూ.225.27 కోట్ల బియ్యాన్ని అమ్ముకుని సర్కారుకే 'కుచ్చుటోపీ' పెట్టారు. ఇదంతా వాస్తవమేనని తనిఖీలకొచ్చిన విజిలెన్స్ అధికారులకు..ఎన్ఫోర్స్ మెంట్ అధికారులకు.. ఫిజికల్ వెరిఫికేషన్ చేసిన సివిల్ సప్లై అధికారులకు అందరికీ తెలుసు ఏ ఒక్క రైస్ మిల్లులో ధాన్యం నిల్వలు లేవని.! ఈ నివేదికలను ప్రభుత్వానికి అందించినప్పటికీ.. 'రైస్ మిల్లర్ల లాబీయింగ్' చక్రం తిప్పడంతో సర్కారు పెద్దలు కూడా 'భుక్తాయాసం'తో ఏసీల్లో చర్యలు తీసుకోవాలన్న విషయం మరిచి లైట్ తీసుకుంటున్నట్టు స్పష్టంగా తెలిసిపోతుంది.బహుశా.! అదే కృతజ్ఞతాభావమేమో అంత మెక్కేసిన రైస్ మిల్లర్లకు మళ్లీ మళ్లీ సిఎమ్మార్ ధాన్యం కేటాయింపులు చేస్తున్న వైనం 'దొంగలందరూ ఒకే గూటికి' చేరినట్టైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.!**

**- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**

### 90 రోజుల గడువు ఇచ్చి.. మరి కేటాయింపులు చేయకపోవడంలో మర్మమేంటో.?

జగిత్యాల జిల్లాలో 2022-23 ఖరీఫ్ సీజన్లో 10 రైస్ మిల్లర్లపై కేసులు పెట్టాలని సివిల్ సప్లై అధికారులు నిర్ణయించారు. అయితే..ఇందులో కేవలం కోరుట్ల, రాయికల్,పెగడపల్లి రైస్ మిల్లర్లపై మాత్రమే కేసులు పెట్టి..ఆ తర్వాత ఏ సీజన్ లలోనూ వడ్లను కేటాయించకుండా పెండింగ్ బకాయిలు చెల్లించాలని తీవ్ర ఒత్తిడి లకు గురిచేస్తున్నారు. 90 రోజుల గడువు ఇచ్చి పెనాల్టీ 125% నికి అదనంగా 12% వడ్డీ కలిపి చెల్లించాలని అధికారికంగా ప్రభుత్వం (పౌర సరఫరాల శాఖ) బకాయిలు ఉన్న మిల్లర్లకు అల్టిమేటం ఇచ్చారు.కాగా, తమకు వడ్లు కేటాయించకుండా.. రైస్ మిల్లు మూసేసి.. ఆస్తులు జప్తు చేసి.. బ్యాంకు ఖాతాల లావాదేవీలు నిలిపివేసి.. కొత్తగా అప్పులు పుట్టకుండా చేసి 'బకాయిలు' కట్టమంటే ఎలా కడతామంటున్నారు 'కేసులైన బాధిత రైస్ మిల్లర్లు'.! మరి అధికారులు గుర్తించిన 10 మంది రైస్ మిల్లర్లలో కేవలం ముగ్గురు 'రా-రైస్' మిల్లర్లపై మాత్రమే కేసులు ఎందుకు నమోదు చేశారు.? మిగిలిన వారిపై ఎందుకు కేసులు పెట్టలేదు.? మళ్లీ వారికే ప్రతీ సీజన్ లో ధాన్యం ఎందుకు కేటాయిస్తున్నట్లు.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 28-02-2026 వరకు గడువు ఇచ్చారు సరే.! తమకు వడ్లు కేటాయించకుండా ఆ పెండింగ్ బకాయిలను ఎలా కట్టాలో ఆ అధికారులే చెప్పాలని బాధిత రైస్ మిల్లర్లు' కోరుతున్నారు.



### అప్పుడు 'దొడ్డు వడ్లు' ఇచ్చారు..'సన్న బియ్యం' పెట్టుమంటున్నారు

ఇదెక్కడి లెక్క.? 2022-23 ఖరీఫ్ సీజన్లో తమకు 'దొడ్డు వడ్లు' సిఎమ్మార్' కేటాయించారని.. ఇప్పుడు పెనాల్టీ,వడ్డీ, రూపంలో కట్టుమని లేదా 'సన్నబియ్యం' ఇవ్వాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తోందని 'డిఫాల్టర్ మిల్లర్' లు వాపోతున్నారు.మా 'నవరంధ్రాలు' మూసేసి..మా జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని బాధిత రైస్ మిల్లర్లు' విలపిస్తున్నారు.వడ్ల నిల్వల్లో తేడా ఉందని గుర్తించి మాపై కేసులు పెట్టారు..మరి మిగితా 50 మంది రైస్ మిల్లుల్లో కూడా మాకంటే ఎక్కువ తేడాలు ఉన్నా.. ధాన్యం మాయమైనట్టు తేలినా అలాంటి వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీస్తున్నారు.ఇదే విధంగా 800 మంది రైస్ మిల్లర్లు డిఫాల్ట్ ఐనా.. చాలా మందికి ధాన్యం కేటాయింపులు చేశారని.. మాపై ఎందుకీ పగ అని ప్రశ్నిస్తున్నారు.

### 6 ఏళ్లలో రూ.10 వేల కోట్లు స్వాహా.!

రాష్ట్రవ్యాప్తంగా 1,500కు పైగా మిల్లర్లు 2019 నుంచి రూ.10,000 కోట్లకు పైగా విలువైన బియ్యాన్ని మోసం చేసినట్టు అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటోంది. విజిలెన్స్ దాడులు, ఆస్తుల జప్తు, కేసులు నమోదు చేస్తూ మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేస్తోందని.. రూ.668 కోట్లు ఇప్పటికే వసూలయ్యాయని , మరో రూ.1,438 కోట్లు బకాయి ఉన్నాయని సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు. ఈ మోసాల వల్ల పేదలకు అందాల్సిన PDS బియ్యం నష్టపోయిందంటున్నారు. రైతులకు MSP ఇచ్చి కొనుగోలు చేసిన ధాన్యం ప్రజలకు చేరకుండా పోయింది. అధికారులు మిల్లర్లతో కుమ్మక్కైనట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఇకపై కఠిన నిబంధనలు అమలు చేస్తూ, డిఫాల్టర్లపై ఆర్ఆర్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటోంది. ఈ ఘటన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బ తీసిందని చెప్పొచ్చు.

### ఎగ్గొట్టిన రైస్ మిల్లర్లపై ప్రేమెందుకో.?

అప్పనంగా 'గల్లా పెట్టెల్లో'కి వచ్చిపడ్డ రూ.6000 కోట్లు రికవరీ చేయడంలో సివిల్ సప్లై అధికారులు ఎందుకు వెనుకంజవేస్తున్నారు.? 'రైస్ మిల్లర్ల అసోసియేషన్' లాబీయింగ్ వల్లనే సివిల్ సప్లై అధికారులు తమ 'నవరంధ్రాలు' మూసుకున్నారా.? తరచూ 'గుట్టు చప్పుడు' కాకుండా జరిగే ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు వచ్చే అధికారుల జేబులు 'బరువు'గా వెళుతుంటాయని జరుగుతున్న ప్రచారం నిజమేనా.? వడ్ల నిల్వల్లో తేడాలున్నాయని తేల్చినందుకే ఆ రైస్ మిల్లర్లు 'బరువైన బహుమతులు' ఇస్తున్నారా.? అందుకే కొందరు అధికారులు తమ ఆదాయానికి మించి 'కళ్లు చెదిరే అతి ఖరీదైన భవనాలు' నిర్మించుకుంటున్నారా.? తాము నొక్కేసిన ఈ రూ.6000 కోట్లు దారి మళ్లించి విల్లాలు..నగలు..రియల్ వెంచర్లు వేసుకుంటున్నది ఇక దాదాపు నిజమేనన్నట్టా.? గత ప్రభుత్వం లాగే..ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు కూడా ఈ 'రైస్ మిల్లర్ల అసోసియేషన్' లాబీయింగ్ లో తమకి కావాల్సినంత 'సొమ్ములు' వెనకేసుకుంటున్నారన్నది కాదనలేని నిజమేనా.? 'రైస్ మిల్లర్ల అసోసియేషన్' లాబీయింగ్ వారి మాటలు వినని రైస్ మిల్లర్లకు ఇక 'ఉరే దిక్కా.'!? 'తిలా పాపం-తలా పిడికెడు' లాగా..'సిఎమ్మార్ పాపం-అటెండర్ మొదలుకొని..అమాత్యుల వరకు తలా లారెడు' అన్నట్టుగా మార్చేశారు..మాయదారి 'రైస్ మిల్లర్లు'.!!

### 'ఆ-కొందరు రైస్ మిల్లర్ల'పైనే కేసులెందుకు.?

ప్రతీ రైస్ మిల్లుకు 400 లారీల సిఎమ్మార్ ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులు రైస్ మిల్లర్లకు పంపిస్తే..ఆ ధాన్యాన్ని తిరిగి బియ్యంగా మార్చి సివిల్ సప్లై గోదాంకు.. ఎఫ్సీఐ గోదాం లకు పంపించకుండా 'బ్లాక్ మార్కెట్'కు తరలించి కోట్లు గడించారు.అయితే..ఆ ధాన్యం తమకు పంపలేదని తెలిసి.. ఫిజికల్ వెరిఫికేషన్‌లలో తేల్చిన నివేదిక ఆధారంగా 'కొందరు మిల్లర్ల'పై మాత్రమే కేసులు నమోదయ్యాయి.కానీ మిగిలినవారిపై చర్యలు లేకపోవడం, బకాయిలు ఉన్నా మళ్లీ ధాన్యం కేటాయింపులు జరగడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్త సమస్యై కూర్చుంది.



### ఒక్క జగిత్యాల జిల్లాలోనే రూ.225.27 కోట్ల రైస్ మిల్లర్ల జవీ= బకాయిలు

జగిత్యాల జిల్లాలో 2022-23 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సిన కస్టమ్ మిల్డ్ రైస్ (జవీ=) బకాయిలు గణనీయంగా ఉన్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం, 2024 జనవరి నాటికి జగిత్యాల జిల్లాలో సుమారు 33,000 మెట్రిక్ టన్నుల జవీ= బకాయి ఉండగా, ఇది 50 మంది రైస్ మిల్లర్లు రూ.225.27 కోట్లు భోంచేసినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.ఇదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 314 రైస్ మిల్లుల్లో ఏ ఒక్క రైస్ మిల్లులో కూడా వడ్లు లేవని ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఎన్నో సార్లు ఆకస్మిక తనిఖీలు.. ఫిజికల్ వెరిఫికేషన్ లలో తేల్చిన వాస్తవాలు.ఇదే క్రమంలో విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఇంకా మిల్లులపై దాడులు నిర్వహించి ఫిజికల్ వెరిఫికేషన్ చేస్తూనే ఉన్నారు. జగిత్యాలలో 2025 జూన్‌లో ఒక రైస్ మిల్లుపై అర్ధరాత్రి దాడి జరిగి, రేషన్ బియ్యం రీసైక్లింగ్, ప్రభుత్వ ధాన్యం లెక్కలకు వ్యత్యాసాలు గుర్తించారు. ఇలాంటి తనిఖీల్లో ధాన్యం లేకపోవడం, పక్కదారి పట్టించినట్టు నివేదికలు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ దాడుల్లో జగిత్యాల జిల్లా కూడా భాగమైంది (2025 నవంబర్ నాటి రిపోర్టుల ప్రకారం, జగిత్యాలతోపాటు 11 జిల్లాల్లో లక్షల టన్నుల ధాన్యం మాయమైనట్టు గుర్తింపు).



TGTEL/25/A1737 | NETI SAKSHI

# ఐపీఎల్ దెబ్బకు పీఎస్ఎల్ ఖాళీ

ఐపీఎల్ 2026 వేలం కారణంగా పాకిస్తాన్ సూపర్ లీగ్ (PSL)కు భారీ నష్టం వాటిల్లింది. పీఎస్ఎల్ జట్లలో కీలక సభ్యులుగా ఉన్న 11 మంది అంతర్జాతీయ ఆటగాళ్లను ఐపీఎల్ ఫ్రాంఛైజీలు దక్కించుకోవడమే దీనికి ప్రధాన కారణం. వీరి కోసం ఐపీఎల్ యాజమాన్యాలు మొత్తం రూ.27.3 కోట్లు వెచ్చించాయి. ఈ 11 మందిలో 10 మందిని వేలంలో కొనుగోలు చేయగా, మిచెల్ ఓవెన్‌ను పంజాబ్ కింగ్స్ రూ.3 కోట్లకు ముందే రిటైన్ చేసుకుంది. ఐపీఎల్, పీఎస్ఎల్ తదుపరి సీజన్లు ఒకే సమయంలో ప్రారంభమయ్యే అవకాశం ఉండటంతో, ఈ ఆటగాళ్లందరూ పీఎస్ఎల్‌ను వదులుకుని ఐపీఎల్‌లోనే ఆడే అవకాశం ఉంది. పీఎస్ఎల్ నుంచి ఐపీఎల్‌కు మారిన ఆటగాళ్లలో ఫిన్ అలెన్, జేసన్ హోల్డర్, టిమ్ సైఫర్ట్, మాథ్యూ షార్ట్, అకీల్ హోసేన్, కైల్ జేమీసన్, ల్యూక్ వుడ్, ఆడమ్ మిల్నే, జోర్డాన్ కాక్స్, బెన్ ద్వార్షుయిస్ వంటి ప్రముఖులు ఉన్నారు. వీరి చేరికతో ఐపీఎల్ జట్లు మరింత బలోపేతం కాగా, పీఎస్ఎల్ మాత్రం తన స్టార్ ఆటగాళ్లను కోల్పోయి కళ తప్పేలా కనిపిస్తోంది. ఆటగాళ్లు ఆర్థికంగా, క్రీడా పరంగా ఎంతో లాభదాయకమైన ఐపీఎల్‌కే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం పీఎస్ఎల్ నిర్వాహకులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ వేలంలో ఏ ప్లేయర్‌ను ఏ టీమ్ కొనుగోలు చేసిందనే వివరాలను పరిశీలిస్తే.. క్వెట్టా గ్లాడియేటర్స్‌కు ఆడిన ఫిన్ అలెన్‌ను కేకేఆర్ రూ.2 కోట్లకు, అకీల్ హోసేన్‌ను సీఎస్కే రూ.2 కోట్లకు, కైల్ జేమీసన్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.2 కోట్లకు కొనుగోలు చేశాయి. ఇస్లామాబాద్ యునైటెడ్ నుంచి జేసన్ హోల్డర్‌ను గుజరాత్ టైటాన్స్ రూ.7 కోట్లకు, మాథ్యూ షార్ట్‌ను సీఎస్కే రూ.1.5 కోట్లకు, జోర్డాన్ కాక్స్‌ను ఆర్సీబీ రూ.75 లక్షలకు, బెన్ ద్వార్షుయిస్‌ను పంజాబ్ కింగ్స్ రూ.4.40 కోట్లకు దక్కించుకున్నాయి. కరాచీ కింగ్స్ నుంచి టిమ్ సైఫర్ట్‌ను కేకేఆర్ రూ.1.50 కోట్లకు, ఆడమ్ మిల్నేను రాజస్థాన్ రాయల్స్ రూ.2.40 కోట్లకు తీసుకున్నాయి. అలాగే పెషావర్ జల్మీకి ఆడిన ల్యూక్ వుడ్‌ను గుజరాత్ టైటాన్స్ రూ.75 లక్షలకు సొంతం చేసుకుంది. పీఎస్ఎల్, ఐపీఎల్ మధ్య తలెత్తిన ఈ చిక్కుముడికి ప్రధాన కారణం రెండు లీగ్‌ల షెడ్యూల్‌లు ఒకేసారి రావడం. నివేదికల ప్రకారం రెండు లీగ్‌లు మార్చి 26 నుండే ప్రారంభం కానున్నాయి. ఒకే సమయంలో రెండు లీగ్‌లు జరిగినప్పుడు, ఆటగాళ్లు సహజంగానే అత్యధిక ఆదాయం, క్రేజ్ ఉన్న ఐపీఎల్‌నే ఎంచుకుంటారు. ఈ 11 మంది ఆటగాళ్లు కూడా అదే బాటలో పయనిస్తూ పీఎస్ఎల్ తదుపరి సీజన్‌కు దూరం కానున్నారు. ఇది పీఎస్ఎల్ ఫ్రాంఛైజీలకు ఆటగాళ్ల ఎంపిక విషయంలో పెద్ద సవాలుగా మారనుంది.



### గుజరాత్ టైటాన్స్ పూర్తి జట్టు ఇదే

జేసన్ హోల్డర్ (రూ.7 కోట్లు), అశోక్ శర్మ (రూ.90 లక్షలు),టామ్ బాంటన్ (రూ.2 కోట్లు), పృథ్వీరాజ్ యర్రా (రూ.30 లక్షలు), ల్యూక్ వుడ్ (రూ.75 లక్షలు). రిటెన్షన్స్: అనుజ్ రావత్, గ్లెన్ ఫిలిప్స్, గుర్నూర్ సింగ్ బ్రార్, ఇషాంత్ శర్మ, జయంత్ యాదవ్, జోస్ బట్లర్, కగిసో రబాడ, కుమార్ కుశాగ్రా, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ అర్షద్ ఖాన్, నిశాంత్ సింధు, ప్రసిద్ధ్ కృష్ణ, సాయి కిశోర్, రాహుల్ తెవాతియా, రషీద్ ఖాన్, సాయి సుదర్శన్, షారుక్ ఖాన్, శుభ్‌మన్ గిల్, వాషింగ్టన్ సుందర్.

### పంజాబ్ కింగ్స్ పూర్తి జట్టు ఇదే

కూపర్ కునెలి (రూ.3 కోట్లు), బెన్ ద్వార్షుయిస్ (రూ.4.4 కోట్లు),ప్రవీణ్ దూబె (రూ.30 లక్షలు). రిటెన్షన్స్: అర్ష్‌దీప్ సింగ్, అజ్మతుల్లా ఒమర్జాయ్, హర్నూర్ పన్ను, హర్‌ప్రీత్ బ్రార్, లాకీ ఫెర్గూసన్, మార్కో యాన్సెన్, మార్కస్ స్టాయినిస్, మిచ్ ఓవెన్, ముషీర్ ఖాన్, నేహాల్ వధేరా, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య, పైలా అవినాష్, శశాంక్ సింగ్, శ్రేయస్ అయ్యర్, సుర్యాంశ్ షెడ్గే, విష్ణు వినోద్, వైశాక్ విజయ్‌కుమార్, జేవియర్ బార్ట్‌లెట్, యశ్ ఠాకూర్, యుజ్వేంద్ర చాహల్.

### సన్‌రైజర్స్ హైదరాబాద్ పూర్తి జట్టు ఇదే

లియామ్ లివింగ్‌స్టోన్ (రూ.13 కోట్లు), సలీల్ అరోరా (రూ.1.5 కోట్లు), శివంగ్ కుమార్ (రూ.30 లక్షలు), సాకిబ్ హుస్సేన్ (రూ.30 లక్షలు), ఓంకార్ తర్మలే (రూ.30 లక్షలు), అమిత్ కుమార్ (రూ.30 లక్షలు), ప్రఫులే హింగే (రూ.30 లక్షలు), క్రెయిన్స్ (రూ.30 లక్షలు), శివమ్ మావి (రూ.75 లక్షలు). రిటెన్షన్స్: అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ, బ్రైడన్ కార్స్, ఎషాన్ మలింగ, హర్ష్ దూబె, హర్షల్ పటేల్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, జయ్‌దేవ్ ఉనద్కత్, కమిందు మెండిస్, నితీశ్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్, స్మరన్ రవిచంద్రన్, ట్రావిస్ హెడ్, జిషన్ అన్సారీ.

### రాజస్థాన్ రాయల్స్ పూర్తి జట్టు ఇదే

రవి బిష్ణోయ్ (రూ.7.4 కోట్లు), ఆడమ్ మిల్నే (రూ.2.4 కోట్లు), సుశాంత్ మిశ్రా (రూ.90 లక్షలు), విఘ్నేష్ పుతుర్ (రూ.30 లక్షలు), యశ్ రాజ్ పుంజా (రూ.30 లక్షలు), రవి సింగ్ (రూ.95 లక్షలు), అమన్ రావు (రూ.30 లక్షలు), బ్రిజేష్ శర్మ (రూ.30 లక్షలు), కుల్‌దీప్ సేన్ (రూ.75 లక్షలు). రిటెన్షన్‌లు: ధ్రువ్ జురెల్, డొనావన్ ఫెరీరా (ట్రేడ్), జోఫ్రా ఆర్చర్, క్వేనా మఫాకా, లువాన్ డ్రే ప్రిటోరియస్, నాంద్రీ బర్గర్, రవీంద్ర జడేజా (ట్రేడ్), రియాన్ పరాగ్, సామ్ కరన్ (ట్రేడ్), సందీప్ శర్మ, షిమ్రోన్ హెట్‌మయర్, శుభమ్ దూబె, తుషార్ దేశ్‌పాండే, వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్, యుధ్వీర్ చరక్.

### రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

వెంకటేశ్ అయ్యర్ (రూ.7 కోట్లు), జాకబ్ డఫీ (రూ.2 కోట్లు),సాత్విక్ దేస్వాల్ (రూ.30 లక్షలు), మంగేశ్ యాదవ్ (రూ.5.2 కోట్లు), జోర్డాన్ కాక్స్ (రూ.75 లక్షలు), విక్కీ ఓస్త్వాల్ (రూ.30 లక్షలు), విహాన్ మల్హోత్రా (రూ.30 లక్షలు), కాన్షిక్ చౌహాన్ (రూ.30 లక్షలు). రిటెన్షన్స్: అభినందన్ సింగ్, భువనేశ్వర్ కుమార్, దేవ్‌దత్ పడిక్కల్, జాకబ్ బెతెల్, జితేశ్‌శర్మ, జోష్ హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్య, నువాన్ తుషార, ఫిల్ సాల్ట్, రజత్ పాటిదార్, రసిఖ్ దార్ సలామ్ , రొమారియో షెఫర్డ్, సుయాశ్ శర్మ, స్వప్నిల్ సింగ్, టిమ్ డేవిడ్, విరాట్ కోహ్లీ, యశ్ దయాళ్.

### ముంబయి ఇండియన్స్ పూర్తి జట్టు ఇదే

క్వింటన్ డికాక్ (రూ.కోటి), డానిష్ మలేవార్ (రూ.30 లక్షలు), మహ్మద్ ఇజార్ (రూ. 30 లక్షలు), అథర్వ అంకోలేకర్ (రూ. 30 లక్షలు), మయాంక్ రావత్ (రూ. 30 లక్షలు). రిటెన్షన్స్: అల్లా ఘజన్‌ఫర్, అశ్వనీ కుమార్, కార్బిన్ బాష్, దీపక్ చాహర్, హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా, మయాంక్ మార్కండే (ట్రేడ్), మిచెల్ శాంట్నర్, నమన్ ధీర్, రఘు శర్మ, రాజ్ అంగద్ బావా, రాబిన్ మింజ్, రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్‌టన్, శార్దూల్ ఠాకూర్ (ట్రేడ్), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (ట్రేడ్), సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, ట్రెంట్ బౌల్ట్, విల్ జాక్స్.

### దిల్లీ క్యాపిటల్స్ పూర్తి జట్టు ఇదే

బెన్ డకెట్ (రూ.2 కోట్లు), డేవిడ్ మిల్లర్ (రూ.2 కోట్లు), అకిబ్ నబీ (రూ.8.4 కోట్లు), పాథుమ్ నిశాంక (రూ.5 కోట్లు), లుంగి ఎంగిడి (రూ.2 కోట్లు), పృథ్వీ షా (రూ.75 లక్షలు), సాహిల్ పరేఖ్ (రూ.30 లక్షలు), కైల్ జేమిసన్ (రూ.2 కోట్లు). రిటెన్షన్స్: అభిషేక్ పోరెల్, అజయ్ మండల్, అశుతోష్ శర్మ, అక్షర్ పటేల్, దుష్మంత చమీర, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్, కుల్‌దీప్ యాదవ్, మాధవ్ తివారీ, మిచెల్ స్టార్క్, ముకేశ్ కుమార్, నితీష్ రాణా (ట్రేడ్), సమీర్ రిజ్వీ, టి. నటరాజన్, త్రిపురణ విజయ్, ట్రిస్టన్ స్టబ్స్, విప్రాజ్ నిగమ్.

### కోల్‌కతా నైట్‌రైడర్స్ పూర్తి జట్టు ఇదే

కామెరూన్ గ్రీన్ (రూ. 25.20 కోట్లు), ఫిన్ అలెన్ (రూ. 2 కోట్లు), తేజస్వి సింగ్ (రూ. 3 కోట్లు), మతీశ పతిరన (రూ.18 కోట్లు), ముస్తాఫిజుర్ రెహ్మాన్ (రూ. 9.2 కోట్లు), టిమ్ సీఫెర్ట్ (రూ. 1.5 కోట్లు), ప్రశాంత్ సోలంకి (రూ. 30 లక్షలు), కార్తీక్ త్యాగి (రూ. 30 లక్షలు), రాహుల్ త్రిపాఠి (రూ. 75 లక్షలు), సార్థక్ రంజన్ (రూ. 30 లక్షలు), దక్ష్ కమ్రా (రూ. 30 లక్షలు), రచిన్ రవీంద్ర (రూ. 2 కోట్లు), ఆకాశ్ దీప్ (రూ. 1 కోటి).రిటెన్షన్స్: అజింక్య రహానె, అంగ్‌క్రిష్ రఘువంశీ, అనుకుల్ రాయ్, హర్షిత్ రాణా, మనీష్ పాండే, రమణ్‌దీప్ సింగ్, రింకు సింగ్, రోవ్‌మన్ పావెల్, సునీల్ నరైన్, ఉమ్రాన్ మాలిక్, వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి.

### లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పూర్తి జట్టు ఇదే

ముకుల్ చౌదరి (రూ.2.6 కోట్లు), వానిందు హసరంగా (రూ.2 కోట్లు), అన్రిచ్ నోకియా (రూ.2 కోట్లు), నమన్ తివారీ (రూ.కోటి), అక్షత్ రఘువంశీ (రూ.2.2 కోట్లు), జోష్ ఇంగ్లిస్ (రూ.8.6 కోట్లు). రిటెన్షన్స్: అబ్దుల్ సమద్, ఐదెన్ మార్‌క్రమ్, ఆకాశ్ సింగ్, అర్జున్ టెండూల్కర్ (ట్రేడ్), అర్షిన్ కులకర్ణి, అవేశ్ ఖాన్, ఆయుష్ బదోని, దిగ్వేష్ రాఠీ, హిమ్మత్ సింగ్, మణిమారన్ సిద్ధార్థ్, మాథ్యూ బ్రీట్జ్కే, మయాంక్ యాదవ్, మహ్మద్ షమీ (ట్రేడ్), మిచెల్ మార్ష్, మోసిన్ ఖాన్, నికోలస్ పూరన్, ప్రిన్స్ యాదవ్, రిషభ్ పంత్, షాబాజ్ అహ్మద్.

### చెన్నై సూపర్ కింగ్స్ పూర్తి జట్టు ఇదే

కార్తీక్ శర్మ (రూ. 14.20 కోట్లు), ప్రశాంత్ వీర్ (రూ.14.20 కోట్లు), అకీల్ హోసేన్ (రూ.2 కోట్లు), మాథ్యూ షార్ట్ (రూ.1.5 కోట్లు), అమన్ ఖాన్ (రూ.40 లక్షలు), సర్ఫరాజ్ ఖాన్ (రూ.75 లక్షలు), మాట్ హెన్రీ (రూ.2 కోట్లు), రాహుల్ చాహర్ (రూ.5.2 కోట్లు), జాక్ ఎడ్వర్డ్స్ (రూ.3 కోట్లు), జాక్ ఫౌల్క్స్ (రూ.75 లక్షలు). రిటెన్షన్స్: అన్షుల్ కాంబోజ్, గుర్జప్నీత్ సింగ్, జేమీ ఓవర్టన్, ఎంఎస్ ధోనీ, ముకేష్ చౌదరి, నాథన్ ఎల్లిస్, నూర్ అహ్మద్, రామకృష్ణ ఘోష్, సంజు శాంసన్ (ట్రేడ్), రుతురాజ్ గైక్వాడ్, శివమ్ దూబె, శ్రేయస్ గోపాల్, ఖలీల్ అహ్మద్, ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్, ఉర్విల్ పటేల్.

---

## సూర్యకుమార్ ఒక్కడే ఒంటి చేత్తో సిరీస్‌లు గెలిపించగలడు

### శివం దూబే కీలక వ్యాఖ్యలు



మరికొన్ని రోజుల్లో టీ20 వరల్డ్ కప్ ఉండగా టీమిండియాపై ఒత్తిడి పెరుగుతోంది. అందుకు కారణంగా ఇద్దరు స్టార్ బ్యాటర్లు వరుసగా విఫలం కావడమే. ముఖ్యంగా ఓపెనర్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ లను వరుస వైఫల్యాలు వెంటాడుతున్నాయి. ఆల్ రౌండర్ శివమ్ దూబే, ఫామ్ లో లేని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కు మద్దతుగా నిలిచాడు. టీ20 కెప్టెన్ అయిన సూర్యకుమార్ మ్యాచ్ విన్నర్ అని.. అతడు ఒంటరిగా మ్యాచ్ గెలిపించగల బ్యాటర్ అని, సరైన సమయంలో ఫామ్ లోకి వస్తాడని దీమా వ్యక్తం చేశాడు. సూర్యకుమార్ చివరి టీ20 హాఫ్ సెంచరీ అక్టోబర్ 2024లో చేశాడు. ప్రపంచ కప్ నకు రెండు నెలల కంటే తక్కువ సమయం ఉండటంతో ౩ాఖ్‌పై ఒత్తిడి పెరుగుతోంది. దక్షిణాఫ్రికాతో జరిగిన నాల్గవ టీ20 మ్యాచ్ కు కొన్ని గంటల ముందు దూబే మాట్లాడుతూ.. ”సూర్యపై మాకు నమ్మకం ఉంది. అతడు ఒక్కడే 5 మ్యాచ్ లు గెలిపించగలడు. ఫామ్ లో లేకపోతే అతను మంచి ఆటగాడు కాదని అనలేం. ఒంటి చేత్తో భారత్‌కు విజయాలు అందించగల టాలెంట్ అతడి సొంతం” అన్నాడు. ”అతను అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడు. అతడి గణాంకాలు చూస్తే మీకే తెలుస్తుంది. అవును, ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ పరుగులు బ్యాట్ నుంచి పరుగులు రావడం లేదు. కానీ సరైన సమయంలో అతను ఫామ్ లోకి వస్తాడు. ఏ క్షణంలోనైనా బిగ్ ఇన్నింగ్స్ ఆడగలడు. సూర్య ఓ యోధుడు. అతను పరుగులు చేసినా చేయకపోయినా, మంచి ఆటగాడు. ఎల్లప్పుడూ జట్టు కోసం ఏదైనా చేయాలనుకుంటాడు. అతను చాలా దూకుడుగా ఆడే బ్యాటర్, ఇంకా చెప్పాలంటే 360 డిగ్రీల బ్యాట్స్ మన్” అని శివం దూబే అన్నాడు. వైస్ కెప్టెన్ శుభమన్ గిల్ కూడా ఫామ్ లో లేడు, కానీ అతడు సైతం బెస్ట్ ఓపెనర్, బెస్ట్ బ్యాటర్ అని శివం దూబే అతనిపై కూడా నమ్మకం ఉంచాడు. ”శుభమన్ గిల్ ఒక మంచి ఆటగాడు. ఫామ్ ఉన్నా, లేకపోయినా అతని సగటు, స్ట్రైక్ రేట్ బాగుంటాయి. గత కొన్నేళ్లుగా గిల్ భారతదేశం కోసం మంచి ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. ఏ ప్లేయర్ కైనా ఆటలో హెచ్చు తగ్గులు సహజం. కానీ అతను భారతదేశపు అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడన్నది వాస్తవం” అన్నాడు. దక్షిణాఫ్రికా చేతిలో టెస్ట్ సిరీస్ ఓడినా, వన్డే సిరీస్ నెగ్గి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ప్రస్తుతం జరుగుతున్న టీ20 సిరీస్ లో 2-1తో టీమిండియా ఆధిక్యంలో ఉంది. నేడు లక్నో వేదికగా నాలుగో టీ20లో ఇరు జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్ భారత్ నెగ్గితే సూర్య సేన సిరీస్ సొంతం చేసుకుంటుంది.

---

## సీఎస్కే ఘోర తప్పిదం చేసింది

### మాజీ కెప్టెన్, తమిళనాడు క్రికెటర్ క్రిష్ శ్రీకాంత్


ఐపీఎల్ 2026 మినీ వేలంలో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్కే) ఘోర తప్పిదం చేసిందని మాజీ కెప్టెన్, తమిళనాడు క్రికెటర్ క్రిష్ శ్రీకాంత్ అన్నాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్ అయిన ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తీసుకోకపోవడమే సీఎస్కే చేసిన అతిపెద్ద తప్పిదమని అభిప్రాయపడ్డాడు. మంగళవారం అబుదాబి వేదికగా జరిగిన మినీ వేలంలో రూ.43.40 కోట్ల భారీ పర్స్ మనీతో బరిలోకి దిగిన సీఎస్కే 9 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. అనామక ఆటగాళ్లైన ప్రశాంత్ వీర్, కార్తీక్ శర్మలను రూ.14.20 కోట్ల చొప్పున కొనుగోలు చేసిన సీఎస్కే.. రాహుల్ చాహర్‌ను రూ.5.2 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. అకీల్ హోస్సేన్‌ను రూ.2 కోట్లకు కొన్న సీఎస్కే.. మాథ్యూ షార్ట్ (రూ.1.5 కోట్లు), సర్ఫరాజ్ ఖాన్(రూ.75 లక్షలు)లను తీసుకుంది. ముస్తాఫిజుర్ రెహ్మాన్ కోసం సీఎస్కే బాగానే ప్రయత్నించింది. రూ.9 కోట్ల వరకు బిడ్ వేసి వెనకడుగు వేసింది. దాంతో కేకేఆర్ రూ.9.20 కోట్లకు ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను చేజిక్కించుకుంది. అయితే ఈ నిర్ణయాన్ని క్రిష్ శ్రీకాంత్ తప్పుబట్టాడు. మతీష పతీరణను వదిలేసిన నేపథ్యంలో ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేయాల్సిందని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. అతని కోసం రూ.15 కోట్లు ఖర్చు చేసినా ఏం అయ్యేది కాదని తెలిపాడు. తుది జట్టులో లేని ఆటగాడి కోసం రూ.14.20 కోట్లు ఎందుకు ఖర్చు పెట్టారని అసహనం వ్యక్తం చేశాడు. 'ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేయకుండా సీఎస్కే తప్పిదం చేసింది. పతిరణను వదిలేసినప్పుడు ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేయాల్సింది. రూ.12, రూ.15 కోట్లకు వెళ్లినా బిడ్ వేయాల్సింది. అతనిలాంటి బౌలర్ సీఎస్కే చాలా అవసరం. వారికి ముస్తాఫిజుర్ లాంటి డెత్ బౌలర్ లేడు. భారీ ధరకు కొనుగోలు చేసిన కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్‌లో ఒకరు మాత్రమే తుది జట్టులో ఆడుతారు. అకీల్ హుస్సేన్‌ను తుది జట్టులో ఆడించాలి. అతను జడేజా తరహాలో బౌలింగ్ చేయగలడు. పవర్ ప్లేలో కూడా బౌలింగ్ చేయగలడు. నూర్ అహ్మద్‌పైనే పూర్తిగా ఆధారపడలేం. కాబట్టి అకిల్ హుస్సేన్‌ను తుది జట్టులో ఆడించాలి. ప్రశాంత్ వీర్ ఎలా బౌలింగ్ చేస్తాడో మనకు ఇంకా తెలియదు. ప్రస్తుతం సీఎస్కే కుర్రాళ్ల వైపు వెళ్తోంది. రాహుల్ చాహర్‌ను కొనుగోలు చేయడం కూడా మంచి ఎంపిక. అతను ఇప్పటికే తన సామర్థ్య ఏంటో చాటుకున్నాడు. ఐపీఎల్‌లో బాగా రాణించాడు. అతని తీరులో తేడా ఉండవచ్చు. కానీ చెడ్డ బౌలర్ కాదు. చెన్నైలాంటి పిచ్‌లపై అతను బాగా రాణిస్తాడు. గతంలో సీఎస్కేపై పంజాబ్ విజయంలో రాహుల్ చాహర్ కీలక పాత్ర పోషించాడు. రాహుల్ చాహర్, నూర్ అహ్మద్ బాగా బౌలింగ్ చేస్తే ప్రత్యర్థి జట్లు ఇబ్బంది పడుతాయి.చెన్నై వేదికగా జరిగే మ్యాచ్‌ల్లో ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలి. రాహుల్ చాహర్, అఖిల్ హుస్సేన్‌లతో పాటు నూర్ అహ్మద్‌ను ఆడించాలి. అన్షుల్ కాంబోజ్‌ను పక్కనపెట్టాలి. శివమ్ దూబేను మూడో పేసర్‌గా ఉపయోగించుకోవాలి.'అని క్రిష్ శ్రీకాంత్ చెప్పుకొచ్చాడు.

---

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 ప్లేస్ వరుణ్ చక్రవర్తిదే

టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ప్రస్తుతం టి20 అంతర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన బౌలింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఆకట్టుకుంటున్నాడు. నిలకడగా రాణిస్తున్న అతను, డిసెంబర్ 17న విడుదలైన తాజా ఐసీసీ టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా తన కెరీర్‌లోనే అత్యుత్తమ రేటింగ్‌ను నమోదు చేసి చరిత్ర సృష్టించాడు. తాజాగా విడుదలైన ఈ జాబితాలో వరుణ్ తన ఖాతాలో 36 రేటింగ్ పాయింట్లను జోడించుకుని, మొత్తం 818 కెరీర్ బెస్ట్ పాయింట్లను సాధించాడు. గత వారం సౌతాఫ్రికాతో జరిగిన రెండు టి20 మ్యాచ్‌లలో ఒక్కో మ్యాచ్‌లో రెండేసి వికెట్లు (మొత్తం 4 వికెట్లు) తీయడం అతను ఈ ఘనత సాధించడానికి దోహదపడింది. 818 రేటింగ్ పాయింట్లతో వరుణ్ చక్రవర్తి ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. పురుషుల టి20 క్రికెట్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన టాప్-10 బౌలర్ల జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ బౌలర్‌గా వరుణ్ నిలిచాడు. ఈ ఆల్-టైమ్ బెస్ట్ రేటింగ్స్ జాబితాలో అతను ప్రస్తుతం 8వ స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో పాకిస్తాన్ మాజీ పేసర్ ఉమర్ గుల్ 865 రేటింగ్‌తో మొదటి స్థానంలో ఉండగా, వరుణ్ తన ప్రదర్శనతో తబ్రేజ్ షమ్సీ (827), రషీద్ ఖాన్ (828), సునీల్ నరైన్ (832) వంటి దిగ్గజాల సరసన నిలిచాడు. అంతేకాకుండా పాకిస్తాన్ స్టార్ షాదాబ్ ఖాన్ (811), శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగా (809) కంటే మెరుగైన రేటింగ్‌ను వరుణ్ సొంతం చేసుకున్నాడు. వరుణ్ చక్రవర్తి ఇప్పుడు తన తదుపరి లక్ష్యంగా పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది సాధించిన 822 రేటింగ్ పాయింట్లపై దృష్టి సారించాడు. ఈ వారంలో జరగబోయే మ్యాచ్‌లలో గనుక అతను మెరుగైన ప్రదర్శన కొనసాగిస్తే, అఫ్రిదిని అధిగమించి ఆల్-టైమ్ టాప్-10 జాబితాలో 7వ స్థానానికి చేరుకునే






# వారణాసి సెట్స్‌కు వస్తా

## రాజమౌళితో హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్

వారణాసి మూవీ సెట్‌కు వచ్చి షూటింగ్ చూడవచ్చా? అని హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్ మన తెలుగు దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళిని కోరారు. కామెరూన్ దర్శకత్వంలో రూపొందిన విజువల్ వండర్ 'అవతార్'. ఇప్పటికే రెండు భాగాలు వచ్చిన ఈ మూవీ ఇప్పుడు ముచ్చటగా మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్'డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'అవతార్' టీమ్ భారత్‌లో వినూత్నంగా ప్రచారానికి తెర తీసింది. దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి సహా కొంత మంది సినీ ప్రముఖులకు 'అవతార్ 3'ని చూపించారు. అనంతరం జేమ్స్ కామెరూన్, రాజమౌళి వీడియో కాల్ ద్వారా మాట్లాడుకున్నారు. సినిమా మేకింగ్, పాత్రల తీరు తెన్నుల గురించి ఒకరితోనొకరు చర్చించుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ విడుదల చేసింది. ఈ సందర్భంగా 'వారణాసి' మూవీ ప్రస్తుత పరిస్థితి గురించి రాజమౌళిని కామెరూన్ అడిగి తెలుసుకున్నారు. ఏడాదిగా షూటింగ్ జరుగుతోందని, మరో ఏడెనిమిది నెలల పాటు షూటింగ్ ఉందని రాజమౌళి వివరించారు. 'వారణాసి' షూటింగ్, సెట్స్ చూడాలని ఉందన్న కామెరూన్.. 'వచ్చి చూడవచ్చా' అని అడిగారు. ఈ మాటతో రాజమౌళి తెగ సంబరపడిపోయారు. 'మీరు రావడం ఎంతో సంతోషకరమైన విషయం. మా 'వారణాసి' టీమ్ మాత్రమే కాదు. మొత్తం సినిమా ఇండస్ట్రీ థ్రిల్ అవుతుంది' అని రాజమౌళి అనగా, 'పులులతో ఏదైనా షూట్ ప్లాన్ చేస్తుంటే చెప్పు' అని కామెరూన్ సరదాగా అనడంతో నవ్వులు వెల్లివిరిశాయి. సెకండ్ యూనిట్‌కైనా కెమెరా పట్టుకుని తాను కొన్ని సీన్స్ తీస్తానని కామెరూన్ చెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ.. 'అందరి కంటే ముందు 'అవతార్: ఫైర్ అండ్ యాష్' చూడటం నిజంగా ఎంతో సంతోషంగా ఉంది. మూవీలో సీక్వెన్స్, విజువల్స్, పాత్రలు తీర్చిదిద్దిన విధానానికి హ్యాట్సాఫ్. మూవీ చూస్తున్నప్పుడు థియేటర్‌లో చిన్న పిల్లాడిలా అయిపోయాను. బయటకు వచ్చాక కూడా అవే ఆలోచనలు వెంటాడాయి. ముఖ్యంగా కథానాయకుడు జేక్ నైతికంగా డైలమాలో పడే సన్నివేశాలు, అతడు తీసుకునే నిర్ణయాలు ఇందులో మరింత అద్భుతంగా చూపించారు. ఇంతకు మించి ఎక్కువ మాట్లాడితే స్పాయిలర్ అవుతుంది. అవతార్

# బాస్టియన్ రెస్టారెంట్‌పై కేసు

## హైకోర్టును ఆశ్రయించిన నటి శిల్పాశెట్టి

బాలీవుడ్ నటి శిల్పా శెట్టికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ 'బాస్టియన్' బెంగళూరుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను బెంగళూరు పోలీసులు ఈ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. అయితే రెస్టారెంట్‌పై కేసు నమోదు చేయడంపై శిల్పశెట్టి తీవ్రంగా స్పందించింది. ఈ రెస్టారెంట్‌పై వచ్చిన వార్తలను శిల్పా శెట్టి ఖండిస్తూ.. బుధవారం సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.తమపై తమ రెస్టారెంట్‌పై వస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమైనవని. కొందరూ కావాలనే తమ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఈ వివాదానికి క్రిమినల్ రంగు పూస్తున్నారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఇప్పటికే తాము హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశాము. ప్రస్తుతం ఈ విషయం కోర్టు పరిధిలో ఉన్నందున మీడియా సంస్థలు సంయమనం పాటించాలని ఆమె కోరారు. తాము దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నామని, దేశ న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని' శిల్పా శెట్టి పేర్కొన్నారు. బిజినెస్‌మెన్ రంజిత్ బింద్రా స్థాపించిన 'బాస్టియన్ హాస్పిటాలిటీ'లో 2019లో పెట్టుబడి పెట్టిన శిల్పా శెట్టికి ఇందులో 50 శాతం భాగస్వామ్యం ఉంది. బెంగళూరులో అత్యంత ఖరీదైన పబ్‌లలో ఒకటిగా పేరొందిన బాస్టియన్, ఇప్పుడు వరుస వివాదాలతో వార్తల్లో నిలిచింది.



# ఓటీటీలో ఆకట్టుకుంటున్న కాంత




మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం కాంత . సెల్వమణి సెల్వరాజ్ డైరెక్షన్‌లో పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 14న విడుదలైంది. తమిళంలో కాంత చిత్రానికి సాలిడ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద తన ప్రభావాన్ని చూపించడంలో విఫలమైంది. తెలుగులో మాత్రం ఈ చిత్రాన్ని బోరింగ్‌గా ఫీలయ్యారు. ఈ మూవీ ఓటీటీలో మంచి రెస్పాన్స్ రాబట్టుకుంటోంది. ఇటీవలే పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో పలు ప్రధాన భాషల్లో విడుదలైంది కాంత. తాజా అప్‌డేట్ ప్రకారం కాంత చిత్రానికి ఓపెనింగ్ వీకెండ్‌లో 1.1 మిలియన్ వ్యూస్‌తో అద్భుతమైన స్పందన వచ్చింది. ఓటీటీలో విడుదలైన ఫస్ట్ వీకెండ్‌లో 1 మిలియన్ వ్యూస్ అధిగమించిన 17వ కోలీవుడ్ సినిమాగా కూడా నిలిచింది కాంత. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. సముద్రఖని, రానా కీలక పాత్రల్లో నటించారు. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు.

# యువదర్శకుడు కేకే కన్నుమూత



టాలీవుడ్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. యువ దర్శకుడు కిరణ్ కుమార్ (కేకే) బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. ఆయన మృతితో చిత్ర పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కిరణ్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కేజేక్యూ: కింగ్.. జాకీ.. క్వీన్' చిత్రం ప్రస్తుతం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. తన కలల ప్రాజెక్ట్ థియేటర్లలోకి రావడానికి ముందే దర్శకుడు మరణించడం చిత్ర బృందాన్ని మరియు అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కిరణ్ కుమార్ 2010లో కింగ్ నాగార్జున హీరోగా తెరకెక్కిన 'కేడి' సినిమాతో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ సినిమా అప్పట్లో స్టైలిష్ మేకింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. నాగార్జున లాంటి పెద్ద హీరో తనకు అవకాశం ఇవ్వడం వల్లే తాను దర్శకుడిగా ఎదగగలిగానని కిరణ్ కుమార్ ఎప్పుడూ కృతజ్ఞతతో ఉండేవారు. ఇండస్ట్రీలో ఆయనను అందరూ 'కేకే' అని ఆప్యాయంగా పిలుచుకునేవారు. కాగా.. కిరణ్ కుమార్ మృతి పట్ల టాలీవుడ్‌కు చెందిన పలువురు నటీనటులు, దర్శకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రతిభావంతుడైన దర్శకుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.



# మరో హిందీ మూవీలో తమన్నా

తెలుగు, తమిళం, హిందీతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా భాటియా. ఈ ఏడాది తెలుగులో ఓదెల 2 చిత్రంలో లీడ్ రోల్‌లో నటించిన తమన్నా.. హిందీ రైడ్ 2లో కామియో రోల్‌లో మెరిసింది. తాజాగా మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది తమన్నా. షాహిద్ కపూర్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఓ రోమియో చిత్రంలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. విక్రాంత్ మస్సే, దిశా పటాని, నానా పటేకర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ భరద్వాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. బిగ్ బ్జడెట్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం హిందీ నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఓ రోమియో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ భామ ఖాతాలో ఇప్పటికే నాలుగు హిందీ సినిమాలుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి. మెంత్తానికి బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది మిల్కీ బ్యూటీ.

# రొమ్ము క్యాన్సర్ మహిళలకు ఆపరేషన్లు

## సోనూసూద్ మరో బృహత్తర కార్యక్రమం



ఇప్పటికే ఎంతోమందికి సాయం చేసి సోనూసూద్ రియల్ లైఫ్ హీరో అనిపించుకున్నారు. ఆపదలో, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. తాజాగా మరోసారి ఆయన తన మంచి మనసును చాటుకున్నారు. తన ఫౌండేషన్ ద్వారా దేశంలో ఉన్న 500 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్ చికిత్స చేయించినట్లు వెల్లడించారు. దేశంలోని మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంపై మరింత దృష్టిసారించినట్లు తెలిపారు. మొత్తం 500కి పైగా శస్త్రచికిత్సలు జరిగాయి. 500 మంది మహిళలను మేం కాపాడగలిగాం. వారంతా కొత్త జీవితాన్ని పొందారు. వారి కుటుంబాల్లో ఆనందం నింపినందుకు నేనెంతో సంతోషంగా ఉన్నాను. సమష్టి కృషి ద్వారా మాత్రమే ఇలాంటి గొప్ప పనులు జరుగుతాయని సోనూసూద్ తెలిపారు. వైద్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఇది ప్రారంభం మాత్రమేనని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేయడంలో తానెప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు. సోనూసూద్ గొప్ప మనసు చాటుకోవడం ఇదే తొలిసారి కాదు. కరోనా సమయం నుంచి ఆయన తరచూ ఇలాంటి పనులు చేస్తూనే ఉన్నారు. సినిమాల్లో విలన్ పాత్రల్లో నటించిన ఆయన లాక్‌డౌన్ కాలంలో వలస కూలీలను తన సొంత ఖర్చులతో సొంతూళ్లకు పంపించడం ద్వారా రియల్ హీరోగా జనం హృదయాల్లో చోటు దక్కించుకున్నారు. ఆ తర్వాత నుంచి సోషల్ మీడియా వేదికగా తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

# కూటమి ప్రభుత్వం దిగి రాకపోతే వైయస్ జగన్ తొలిగా రిలే దీక్ష !

- కూటమి ప్రభుత్వం దిగి రాకపోతే వైయస్ జగన్ తొలిగా రిలే దీక్ష ఆపై నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు వైసీపీ లో భారీగా చర్చ..
- ఈ విషయంపై ఇప్పటికే ఆయన పార్టీ సీనియర్లతో చర్చించినట్లు సమాచారం..



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా :-: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి గత కొన్ని నెలలుగా మెడికల్ కాలేజీల ప్రైవేటికరణకు (పీపీపీ) సైతం వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే ఉన్నారు. ఇటీవలే కోటి సంతకాల సేకరణ ప్రజల నుంచి చేపట్టి ఆ పత్రాలను వైసీపీ కార్యాలయాల్లో వుంచి ఈనెల డిసెంబర్ 18 రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనతో భేటీ అయ్యి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా చేపట్టిన పత్రాలను అందజేయనున్నారు. ఈ విషయంపై అటు ఏపీ ప్రభుత్వం తో కూడా తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధపడుతున్నారు. ఇప్పటికే మెడికల్ కాలేజీల వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టి ఆ ఉద్యమాల ద్వారా ప్రజలకు అసలు విషయాలను తెలియజేయడంతో పాటుగా ఇటీవలే పెద్ద ఎత్తున ప్రతి చోట వేలాది మందితో ర్యాలీలు కూడా చేపట్టారు. అలాగే ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాలను గవర్నర్ కి అందచేయడం జరుగుతుంది. ఇటీవలే పార్లమెంట్ లో జరిగిన సభలలో కూడా వైసీపీ ఎంపీలు ప్లకార్డులు పట్టుకొని నిరసన కూడా తెలియజేశారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటికరణం చేయకూడదని నిరసన చేపట్టారు. వైసీపీ వాళ్లు చేస్తున్న ఉద్యమానికి కూడా కూటమి ప్రభుత్వం దిగి రాకుంటే, వైయస్ జగన్ ఆమరణ నిరాహార దీక్ష లేదా రిలే దీక్ష మొదలుపెట్టే అవకాశం ఎక్కువగా ఉందని పార్టీలో చర్చ సాగుతోంది. మొదట దశలో రిలే దీక్ష చేస్తారని ఆ తర్వాత నిరాహార దీక్ష మొదలుపెట్టబోతున్నట్లుగా పార్టీ వర్గాల నుంచి విశ్వసనీయ సమాచారం వినిపిస్తోంది. ఈ విషయం పైన వైసీపీలో ఉండే సీనియర్ నేతలతో ఇప్పటికే వైయస్ జగన్ చర్చించినట్లుగా వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయం ప్రభుత్వానికి కొంత మేరకు లిక్ కావడంతో కొంత డైలమాలో పడేసేలా చేసింది. ఈ మధ్య తరచూ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం పైన కూడా జగన్ ఏకధాటిగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు ఏకంగా మెడికల్ కాలేజీల ప్రైవేటికరణ విషయంపై నిరాహారదీక్ష మొదలు పెట్టబోతున్నారనే విషయం వైసీపీ కార్యకర్తలకు ఉత్సాహాన్ని ఇచ్చిన, కూటమి ప్రభుత్వానికి పెద్ద చిక్కు తెచ్చేలా కనిపిస్తోంది. ఏపీ ప్రభుత్వం ఈ విషయాన్ని ఎలా ఎదుర్కొంటుందో వేచి చూడాలి. మరి వైసీపీ నేతలకు దీటుగా కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది. వైయస్ జగన్ నిరాహార దీక్ష చేపట్టకనే అంతవరకు రానీయకుండా కూటమి నేతలు ఏదో ఒకటి తేల్చాల్సి ఉంది..

# శ్రీవారి కానుకలను లెక్కించే విధానంపై హైకోర్టు అభ్యంతరం



- ఆటోమేటెడ్ అయితే 100 మంది చేయాల్సిన పనిని 10 మందితో పూర్తి చేయొచ్చని న్యాయస్థానం స్పష్టం..

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా :-: తిరుమల శ్రీవారి కానుకలను లెక్కించే విధానంపై ఏపీ హైకోర్టు అభ్యంతరం తెలిపింది. పదే పదే దొంగతనాలు జరుగుతున్నప్పటికీ, కానుకలను లెక్కించే పురాతన మాన్యువల్ విధానాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కొనసాగించడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మానవ ఆధారిత లెక్కింపును ముగించి, యంత్రాలు, కృత్రిమ మేధస్సుతో సహా సాంకేతికతను స్వీకరించడం ద్వారా మొత్తం ప్రక్రియను ఆధునీకరించడానికి ఇదే సరైన సమయమని ధర్మసనం పేర్కొంది. తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని పరకామణిలో జరిగిన దొంగతనాలను సాధారణ గృహ దొంగతనాలుగా పరిగణించలేమని, ఇవి ప్రపంచ వ్యాప్తంగా భక్తితో భగవంతుడికి కానుకలు సమర్పించే కోట్లాది మంది భక్తుల మనోభావాలను అవి తీవ్రంగా గాయపరుస్తాయని జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి సందర్భాల్లో 97 సమస్య కానుకల ద్రవ్య విలువ కాదు, భక్తుల విశ్వాసం, భావోద్వేగాలని న్యాయస్థానం నొక్కి చెప్పింది. మానవ ఆధారిత లెక్కింపును ముగించి, సాంకేతికతను స్వీకరించడం ద్వారా మొత్తం ప్రక్రియను ఆధునీకరించడానికి ఇదే సరైన సమయమని ధర్మాసనం పేర్కొంది. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడం వల్ల మానవ జోక్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని కోర్టు అభిప్రాయపడింది. ఆటోమేటెడ్ అయితే దాదాపు 100 మంది అవసరమయ్యే పనిని కేవలం 10 మంది మాత్రమే నిర్వహించగలరని స్పష్టం చేసింది. మానవ ప్రమేయం తగ్గించడం నేరాలను అరికట్టడానికి సాయపడుతుందని ధర్మాసనం పేర్కొంది. భద్రతా చర్యలను బలోపేతం చేయడం, లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించే సీసీటీవి వ్యవస్థలతో ఏఐ ని అనుసంధానించడం, హుండీ నుండి ప్రసాదాల ప్యాకింగ్, పరకామణికి రవాణా, వేరు చేయడం, లెక్కింపును పూర్తిగా ఆటోమేట్ చేయాలని న్యాయమూర్తి సూచించారు. ఈ దశలలో దొంగతనాన్ని నివారించడానికి సరైన రక్షణ చర్యలు చేపట్టాలని, "తలుపులు తెరిచి ఉంచితే" అత్యంత భక్తివంతులు కూడా ప్రలోభాలకు లోనయ్యే అవకాశం ఉందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

### ఈ కేసు దేని గురించి..

ఈ కేసు 2023 నాటిది. నిందితుడు సివి రవి కుమార్ ఏప్రిల్ 29, 2023న తన లోదుస్తులలో విదేశీ కరెన్సీని దాచి అక్రమంగా తరలించాడు. $11,300 (సుమారు రూ. 9 లక్షలు) తో పట్టుబడినప్పటికీ, FIR లో కేవలం $ 900 రికవరీ మాత్రమే నమోదైంది. నిందితులు గతంలో అనేకసార్లు విదేశీ కరెన్సీ నోట్లను దొంగిలించడం ద్వారా రూ. 100 కోట్ల విలువైన ఆస్తులను కూడబెట్టారని టీటీడీ అధికారులు తరువాత కనుగొన్నారు. దీని తరువాత, ఇద్దరు టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యులు తిరుమల పరకామణి నుండి నిఘా ఫుటేజ్‌లను విడుదల చేశారు.

### కేసు డిసెంబర్ 19కి వాయిదా..

దర్యాప్తు ముందుకెళ్తున్న సమయంలో సాయం అందిస్తూ అనుమానాస్పద స్థితిలో మరణించిన అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ( ఏవీఎస్ఓ) సతీష్ కుమార్ పోస్ట్ మార్టం నివేదికను తమ ముందుంచాలని రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు ఈ విషయాన్ని డిసెంబర్ 19కి వాయిదా వేసింది. పరకామణి దొంగతనం కేసులో కుదిరిన రాజీపై సీఐడీ దర్యాప్తు కోరుతూ జర్నలిస్ట్ ఎం. శ్రీనివాసులు దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు, అక్టోబర్ 27న, టీటీడీ బోర్డు, అధికారులు, దర్యాప్తు అధికారి, ఫిర్యాదుదారుడు సతీష్ కుమార్ పాత్ర, నిందితుడు రవికుమార్, అతని కుటుంబ సభ్యుల స్థిర, చరాస్తులపై విచారణ జరపాలని సీఐడీ, ఏసీబీ డైరెక్టర్ జనరల్స్‌ను హైకోర్టు ఆదేశించింది. తదనంతరం నివేదికలు సమర్పించబడ్డాయి. సీఐడీ డీజీ ఇటీవల అదనపు నివేదికను దాఖలు చేశారు..

# మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెట్టటం దారుణం

- దీని వెనుక పెద్ద ఎత్తున స్కామే దాగుంది.. గుడివాడ అమర్‌నాథ్
- ప్రజల్లో ఏ స్థాయి వ్యతిరేకత ఉందో కోటి సంతకాల ద్వారా తేటతెల్లమైందని విమర్శలు..



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా :-: రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని మూసుకుపోయిన కూటమినేతల కళ్ళు తెరిచేలా చేశాయని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలోని ప్రతి చోట వందలాదిమంది స్వచ్ఛందంగా వైసీపీ శ్రేణులు తరలిరావడం హర్షించదగ్గ విషయమని ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తెచ్చారని దీన్ని ఇప్పటి కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ప్రైవేట్ వాళ్లకు అప్పజెప్పి విద్య వైద్యం పేద ప్రజల నుంచి దూరం చేయాలని భావిస్తున్న కూటమి నేతల కుట్రలు చిన్నాభిన్నమైందని వైయస్ఆర్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఏడు కాలేజీలు పూర్తి చేయడం జరిగింది. ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నెన్నో హామీలు ఉసిగొల్పి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి ఒక్క పథకాన్ని ఆచరణలోకి తీసుకోకుండా నీరుగార్చే ప్రయత్నం చేస్తుంది. అధికారంలోకి వచ్చిన కూటమి 18 నెలల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదు. అభివృద్ధి గంగలో కలిసింది. ఎక్కడ కూడా అభివృద్ధి జరగలేదు. కేవలం స్కామ్‌లకు మాత్రం తెర లేపారని గుడివాడ అమరనాథ్ మండిపడ్డారు. "మెడికల్ కాలేజీల ప్రవేటీకరణపై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వచ్చాయని ఈ వ్యతిరేకతను గురువారం సాయంత్రం నాలుగు గంటలకు గవర్నర్ నజీర్ అహ్మద్ ను వైయస్ జగన్ మర్యాద పూర్వకంగా కలిసి ఆయన దృష్టికి తీసుకెళ్తారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెట్టటం దారుణం. దీని వెనుక పెద్ద ఎత్తున స్కామ్ జరిగింది. కిక్ బ్యాగుల రూపంలో కమీషన్లు దండుకుంటున్నారని గుడివాడ అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల కోట్ల విలువైన భూములను ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెడతారా అంటూ గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నిస్తూ రానున్న రోజుల్లో ప్రభుత్వాన్ని కూడా ప్రైవేట్‌కే అప్పగిస్తారేమోనని ఏం మేలు చేశారని ప్రజలు మిమ్మల్ని మెచ్చుకుంటారు. ప్రజల్లో ఏ స్థాయి వ్యతిరేకత ఉందో కోటి సంతకాల ద్వారా తేటతెల్లం అయింది. ప్రజల డిమాండ్, వారి ఆకాంక్షను గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని గుడివాడ్ అమర్‌నాథ్ పేర్కొన్నారు.

# టన్నెల్ నిర్మాణ అంశాన్ని లేవనెత్తిన వైసీపీ ఎంపీ

- కడప - రాయచోటి హైవేపై ప్రతిపాదిత టన్నెల్ నిర్మాణ అంశాన్ని లేవనెత్తిన - వైసీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా :-: రాజ్యసభ జీరో అవర్‌లో వైసీపీ ఎంపీ మేడ రఘునాథ్ రెడ్డి కడప – రాయచోటి హైవేపై ప్రతిపాదిత టన్నెల్ నిర్మాణ అంశాన్ని లేవనెత్తారు. ఈ రహదారిలో పొడవైన, ప్రమాదకరమైన ఘాట్ సెక్షన్ ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిలో పలువురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారని దీనిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రమాదాలు జరగకుండా అరికట్టాలని మేడా రఘునాథ్ రెడ్డి సభాపతి దృష్టికి తీసుకొచ్చారు. ఈప్రమాదకర ఘాట్ సెక్షన్‌ను బైపాస్ చేయడానికి టన్నెల్ నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారని ఎంపీ పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించారు. టన్నెల్ నిర్మాణం పూర్తయితే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గడమే కాకుండా, ప్రయాణ సమయం, దూరం కూడా తగ్గుతాయని స్పష్టం చేశారు. కడప – రాయచోటి హైవే రాయలసీమ ప్రాంతానికి అత్యంత కీలకమైన రహదారిగా ఉండటమే కాకుండా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే ప్రధాన మార్గమని మేడ రఘునాథ్ రెడ్డి వివరించారు. ఈ నేపథ్యంలో రోడ్డు రవాణా శాఖ వెంటనే ఈ హైవేపై సర్వే నిర్వహించి, టన్నెల్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఊతం లభిస్తుందని, వ్యాపారం, రవాణా, పర్యాటక రంగాలకు



కూడా మేలు జరుగుతుందని ఎంపీ పేర్కొన్నారు. ప్రజల ప్రాణాల రక్షణే ప్రధాన లక్ష్యంగా ఈ అంశాన్ని రాజ్యసభలో లేవనెత్తినట్లు ఆయన స్పష్టం చేశారు..

# నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తాం

### పసుపుల బీటీ రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం-గ్రామ సర్పంచ్ నర్మదా రవి గౌడ్...



**నేటి సాక్షి, నారాయణపేట, డిసెంబర్ 17 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామంలో ఉన్న నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందజేస్తామని పసుపుల గ్రామ సర్పంచ్ నర్మద రవి గౌడ్ అన్నారు. బుధవారం మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామానికి వెళ్లే స్టేజి నుండి గ్రామం వరకు వెళ్లే బీటీ రోడ్డు మరమ్మత్తులను గ్రామ సర్పంచ్ నర్మద రవి గౌడ్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పసుపుల గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలను దశరవారీగా తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలోని డ్రైనేజీలు గాని సిసి రోడ్లు గాని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు గాని పింఛన్లు గాని ఇందిరమ్మ ఇండ్లు గాని గ్రామంలో ఉన్న నిరుపేదలను గుర్తించి ప్రభుత్వ పథకాలను అందించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పసుపుల గ్రామ ఉపసర్పంచ్ మహేష్, బాలరాజు గౌడ్ నారాయణ రాజు ,చెన్నయ్య తుకారం ,విజయ్ రాజు ,ఎం .రాజు, నరేందర్ గౌడ్ ,భానుచందర్ యుగేందర్ రవి గౌడ్, పెద్ద నర్సింలు ,బాబురావు ,ఆనంద్, జోగురాజు, సతీష్ ,గణేష్ ,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మరికల్ మాజీ ఉపసర్పంచ్ చెన్నకేశవ గౌడ్ మృతి

### పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి....



**నేటి సాక్షి, నారాయణపేట :** జిల్లాలోని మరికల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్నకేశవ గౌడ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. బుధవారం నాడు ఉదయం అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. చెన్నకేశవ గౌడ్ మృతి పట్ల గౌడ్ కుటుంబ సభ్యులను నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి పరామర్శించారు. కుంభం శివకుమార్ రెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి, మరికల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బెల్లగొంది వీరన్న, మరికల్ గ్రామ సర్పంచ్ గూప చెన్నయ్య, ఉప సర్పంచ్ గోరె కాజా, అఖిలపక్ష నాయకులు గ్రామస్తులు తదితరులు పరామర్శించారు.

# మాధవరం గ్రామ సర్పంచ్ గా రాయపోళ్ళ మొగులన్న



**నేటి సాక్షి ,నారాయణపేట, డిసెంబర్ 17 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని మాదారం గ్రామ సర్పంచ్ గా రాయపోల మొగులన్న గెలుపొందడం జరిగింది. బుధవారం ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ మాధవరం గ్రామం అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తానన్నారు. గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం మాధవరం గ్రామ సర్పంచ్ గా రాయప్పోల్ల మొగులన్న గెలుపొందడం పట్ల నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్. కొండన్న, వెంకట రాములు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే చిన్న పరిశ్రమలు నెలకొల్పాలి

**రోజుకో గుడ్డు తినండి ఆరోగ్యంగా ఉండండి-రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చినబాబు**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళాభివృద్ధి కోసం గత ఆయన పరిపాలన లోనే మహిళా సంఘాలు ప్రవేశపెట్టారని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పడానికే పెరటి కోళ్ళు పెంపకం ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చిన్నబాబు అన్నారు బుధవారం స్థానిక రామచంద్రపురం మండలం మండల మహిళా సమాఖ్య ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రతి ఒక్క మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ప్రతి కుటుంబం ఆర్థిక పరిపుష్టి చెందుతుందని, ప్రభుత్వం మహిళల స్వావలంబన న కోసం అనేక పథకాలు తీసుకొచ్చిందని ఈ పథకాలన్నీ మహిళలు వినియోగించుకోవాలని కొనియాడారు. అనంతరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేకల తిరుమల రెడ్డి మాట్లాడుతూ మహిళలు రక్తహీనత లేకుండా ఉండాలంటే రోజుకు ఒక గుడ్డు తినాలని తద్వారా మహిళల ఆరోగ్యం మెరుగుపడుతుందని మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. మండలంలో పెరటి కోళ్లు 100 యూనిట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో మండల నాయకులు సింగల్ విండో చైర్మన్ చేకూరి జనార్ధన చౌదరి, ప్రధాన కార్యదర్శి రావిళ్ళ గిరిబాబు,సీనియర్ నాయకులు కొట్టే నర్సింహారెడ్డి, వెటర్నరీ డిపార్ట్మెంట్ జయ కిషోర్ రెడ్డి , భువనేశ్వరి , ఏపీఎం గురుమూర్తి సిసి లు పార్వతమ్మ, సుధాకర్, అకౌంటెంట్ స్వర్ణలత, మండల సమాఖ్య అధ్యక్షులు మహాలక్ష్మి, కార్యదర్శి అరుణ, కోశాధికారి హరిత, మరియు సంఘమిత్రలు పాల్గొన్నారు.

## పెరుమాళ్ళపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ కార్యక్రమం

**డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో**




**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) వెదురుకుప్పం :** మండలంలోని డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ తరపున స్పెషల్ క్యాంపును వెదురుకుప్పం మండలంలోని పెరుమాళ్ళపల్లి గ్రామంలో ప్రారంభోత్సవానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి.మంగళ గౌరీ,గ్రామ సర్పంచ్ బి.శశి ఆనంద రెడ్డి పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో మొదటి రోజు 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ మరియు నలుగురు కమిటీ మెంబర్స్ క్లీనర్ గ్రీన్ కార్యక్రమాన్ని విడతల వారిగా గ్రామాన్ని శుభ్రపరచడం జరిగింది.కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కమిటీ మెంబర్లు డాక్టర్ డి.లావణ్య కుమారి, డాక్టర్ వి.నాగేశ్వరరావు, మరియు వై. శ్రీనివాసులు కార్యక్రమాన్ని దిగ్విజయంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను క్రమ పద్ధతిలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగింది.ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవ నీరతికి పెరుమాళ్ళపల్లి ప్రజలు హర్షం వ్యక్తపరిచారు.

## హనుమాన్ పల్లి గ్రామ సర్పంచ్ గా తిరుపతిరెడ్డి



**నేటి సాక్షి నారాయణపేట డిసెంబర్ 17 :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని పల్లి గ్రామ సర్పంచ్ గా తిరుపతిరెడ్డి 116 ఓట్లతో గెలుపొందడం జరిగింది. సఖి భాయ్ ఎంపికయ్యారు. వాడు సభ్యులు మొనప్ప ఉద్యోగులవి కవిత, మరు నలుగురు తదితర పార్టీల నుండి వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. హనుమాన్ పల్లి గ్రామ సర్పంచ్ గా ఎంపికైన తిరుపతిరెడ్డిని పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ కాల్ అప్ప నాయకులు సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

# డిజైనింగ్ లోపాలతో నిండుతున్న రైల్వే అండర్ బ్రిడ్జిలు

**శాశ్వత పరిష్కారం కోరిన ఎంపీ గురుమూర్తి**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** తిరుపతి పార్లమెంట్ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద వర్షాకాలంలో తలెత్తుతున్న సమస్యల గూర్చి తిరుపతి ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో ప్రస్తావించారు. చిన్నపాటి వర్షాలకే కొన్ని అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలవడంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారడం తోపాటు ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ సమాదనం ఇచ్చారు. దేశవ్యాప్తంగా రైల్వే అండర్ బ్రిడ్జిలు, సబ్‌వేలలో నీరు నిలిచిపోకుండా డ్రైనేజ్ వ్యవస్థలు, నీటి మళ్లింపు మార్గాలు, క్రాస్ డ్రైన్లు, జాయింట్ సీలింగ్, ఎంట్రీ వద్ద హంప్‌లు, కవర్ల షెడ్‌లు, అత్యవసర పంపింగ్ ఏర్పాట్లు వంటి చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. అలాగే అసాధారణ వర్షపాతం సమయంలో ట్రాఫిక్ నిలిపివేయడం, హెచ్చరిక బోర్డులు, గేటు బారియర్లు, వాచ్‌మన్‌ల నియామకం వంటి భద్రతా చర్యలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి, మొత్తం 43 రైల్వే అండర్ బ్రిడ్జిలు ఉన్నాయని, గత వర్షాకాలంలో గూడూరు, రేణిగుంట సెక్షన్ లో చెర్లోపల్లి, కాపుగున్నేరి, రాచగున్నేరి లోని మూడు అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలిచి సమస్య వచ్చిందని, దానిని పంపింగ్ ద్వారా పరిష్కరించినట్లు సమాధానంలో పేర్కొన్నారు. అలాగే తిరుపతి నియోజకవర్గంలో రూ.208 కోట్ల వ్యయంతో 6 చోట్ల రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చినట్లు తెలియజేశారు. మొత్తంగా సమస్య ఉందని ప్రభుత్వం గుర్తించిందని, తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కారాల దిశగా పనులు జరుగుతున్నాయని మంత్రి తన సమాదనంలో తెలియ జేశారు. అయితే డిజైన్ లోపాలపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు నిర్ణయించినట్లు స్పష్టమైన వివరాలు ఇవ్వలేదు. స్థానిక మున్సిపల్ సంస్థలతో సమన్వయంతో సమగ్ర డ్రైనేజ్ పరిష్కారాలపై పని చేస్తున్నామని మాత్రమే తెలిపారు. ఈ అంశంపై ఎంపీ గురుమూర్తి స్పందిస్తూ రైల్వే అండర్ బ్రిడ్జిలలో వర్షాకాలం నీరు నిలవడం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం పడినా కూడా కొన్ని అండర్ బ్రిడ్జిలు నీటితో నిండిపోవడం చూస్తుంటే స్పష్టమైన డిజైన్ లోపాలు, సమగ్ర డ్రైనేజ్ ప్రణాళిక లేకపోవడాన్ని సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు. తాత్కాలిక పంపింగ్ ఏర్పాట్లకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారాలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జిలలో సరైన డ్రైనేజ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న అండర్ బ్రిడ్జిలలో డిజైన్ ఆడిట్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ చర్యలు తీసుకోవాలని ఎంపీ గురుమూర్తి కోరారు.

# వైయస్ జగన్ చేతుల మీదగా చంటి బుడ్డోడికి అన్నప్రాసన

- **ప్రజ్వల్ కృష్ణ రాథోడ్ గా నామకరణం చేసిన - ఏపీ మాజీ సీఎం**



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా :-: తాడేపల్లి లోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఓ అరుదైన సంఘటన చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గ పరిధిలోని బొల్లాపల్లి జడ్పీటీసీ రమావతు భీమి బాయి, బంజారా సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణా నాయక్ ఆయన కుమారుడు అనిల్ కుమార్ నాయక్, కోడలు విజయలక్ష్మి లు కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ రమావతు భీమి బాయి, బంజారా సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణా నాయక్ కోరిక మేరకు ఆయన మనవడికి వైయస్ జగన్ చేతుల మీదగా అన్నప్రాసన కార్యక్రమంతో పాటు నామకరణం చేయించాలని ఎప్పటినుంచో భావిస్తున్నారు. వాళ్ళ కళ ఎట్టకేలకు బుధవారం నాడు సాకారమైంది. బుధవారం జడ్పీటీసీ కుటుంబ సభ్యులు ఏకమై వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ నుండి నేరుగా వైయస్ జగన్ కార్యాలయం వద్దకు వెళ్లి జగన్ కు వివరించారు. జడ్పీటీసీ గా చెప్పారు. అంతలోనే బుడ్డోడిని చూసిన వైయస్ జగన్ వారి వద్ద నుంచి బుడ్డోడిని అందుకున్నారు. ఆ పిల్లాడు జగన్ ఎత్తుకున్నంతసేపు ఆయన వైపే చూస్తూ ముసి ముసి నవ్వులతో హుషారుగా గెంతు లేసాడు. అనంతరం కుటుంబ సభ్యులకు కోరిక మేరకు అన్నప్రాసన మరియు నామకరణం చేయాలని కోరారు. చంటి బుడ్డోడిని లాలించి వారిని అడిగి విచారించి ప్రజ్వల్ కృష్ణ రాథోడ్ గా నామకరణం చేసి చంటి పిల్లాడికి ఆశీస్సులు అందించాడు. ఈ మేరకు చంటి పిల్లాడు తాత, నానమ్మ హర్షం వ్యక్తం చేస్తూ తమ మనవడికి వైయస్ జగన్ చేతుల మీదుగా అన్నప్రాసన, నామకరణం జరిగినందుకు ఎంతో సంతోషిస్తున్నామని ఆయన చేతుల మీదగా కార్యక్రమాలను చేయించాలనుకున్నామని ఇంత దూరం నుంచి వచ్చినందుకు మా కళ సాకారమైంది. జగన్ లా మురిపెంగా ఎత్తుకొని లాలించి మా మనవడికి పేరు పెట్టినందుకు జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని ఆ పిల్లాడిని పిలిచినప్పుడు అంత జగన్ గుర్తుకొస్తారని అన్నారు..

# విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించిన జన సైనికుడు



- **తన వంతు సహకారంగా విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించిన జన సైనికుడు - కొప్పాల రమేష్ బాబు**

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా :-: స్థానిక నియోజకవర్గ జనసేన ముఖ్య నాయకుడు కొప్పాల రమేష్ బాబు బి కొత్తకోట మండల కేంద్రమైన స్థానిక కస్తూరిబాయి పాఠశాలను బుధవారం ఆకస్మాత్తుగా విచ్చేసి సందర్శించి విద్యార్థులను ఆత్మీయంగా పలకరించి వారి బాగోగులను అడిగి విచారించి తరగతి గదులను ఆరా తీసి పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల అవసరాలను గుర్తించి సొంత ఖర్చులతో పరీక్షలకు ఉపయోగపడే ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్సిల్స్, పెన్లు తదితర స్టేషనరీ సామగ్రిని ఉచితంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యే భవిష్యత్తుకు పునాది అనే నమ్మకంతో విద్యార్థులకు అవసరమైన మౌలిక సహాయం అందించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నామని పిల్లల అభివృద్ధే లక్ష్యంగా, సేవా భావంతో ముందుకు సాగుతున్నామని దూర ప్రాంతాల నుండి తల్లితండ్రులను బంధువులను వదిలి విద్య కోసం ఇక్కడికి వచ్చి విద్యను అభ్యసిస్తున్న పిల్లలను కలిసి విచారించడం ద్వారా ఎన్నో విషయాలు తెలుస్తాయని మేము కూడా ఇలాగే చదివి ఉన్నతమైన స్థానాలకు ఎదిగిన వాళ్లమేనని ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తోడుగా ఉన్నామన్న ధైర్యం వాళ్లలో కలుగుతుందని ఇలాంటి కార్యక్రమాలు వాళ్లలో గుర్తింపుగా నిలిచిపోయి ప్రేమగా నిలుస్తుందని రమేష్ బాబు అన్నారు. ఈ సేవా కార్యక్రమానికి రమేష్ బాబు వెంట జనసైనికులు కత్తి ఆది రాయల్, సోమశేఖర, అర్జున్ రాయల్, గల్లా అంజి రాయల్, రెడ్డి మోహన, రమేష్, రాజు, శివ, మహిళ జన సైనికురాలు ప్రభావతి తదితరులుపాల్గొన్నారు..

# అనాథ వృద్ధులకు దుప్పట్లు వితరణ

- **సేవాభావంతో ముందుకొచ్చి అనాథ వృద్ధులకు సాయమందించిన స్థానికుడిని కొనియాడిన - సీఐ వెంకటేషులు**
- **ఈయనను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని అనాథలను గుర్తించి తమ వంతు సహకారం అందించాలని కోరిన ఎస్ ఐ - నరసింహుడు**



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా :-: స్థానిక నియోజకవర్గ పరిధిలోని ములకలచెరువు మండల కేంద్రమైన స్థానిక రైల్వే స్టేషన్ లోని ఫుట్ ఫాత్ పై జీవచ్ఛవంలా ఉన్నట్టువంటి అనాథ వృద్ధులు చలికి పడుతున్న అవస్థలను ఎప్పటినుంచో స్థానికుడు జల్లా చంద్ర గమనిస్తున్నాడు. వాళ్లకు ఎలాగైనా సాయమందించాలన్న సంకల్పంతో అనాథలు పడుతున్న అవస్థలను స్థానిక పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేష్, ఎస్ ఐ నరసింహుడు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఏపీ & తెలంగాణ విజిలెన్స్ చైర్మన్ తనకంటి వేణుగోపాల్ రెడ్డి, సోంపల్లి సింగల్ విండో మాజీ చైర్మన్ ఎం సదాశివప్ప ల దృష్టికి తీసుకెళ్లాడు. సేవాభావంతో చేస్తున్న మంచి పనిని మెచ్చి తమ వంతు సహకారం కూడా అందిస్తామని స్థానికుడు జల్లా చంద్రకు చెప్పారు. ఆయన పిలుపు మేరకు బుధవారం వీరంతా ఏకమై ములకలచెరువు రైల్వే స్టేషన్ వద్దకు చేరుకొని వృద్ధ అనాథులను గుర్తించి చలి నుండి రక్షణ కొరకు ములకలచెరువు మండల సిఐ వెంకటేషులు, ఎస్ఐ నరసింహుడు, వేణుగోపాల్ రెడ్డి, సదాశివప్ప చేతుల మీదగా జల్లా చంద్ర దుప్పట్లను ఉచితంగా పంపిణీ చేశాడు. అనాథలకు సేవాభావంతో దుప్పట్లను అందించేందుకు ముందుకొచ్చిన స్థానికుడు జల్లా చంద్రాను సిఐ, ఎస్ఐ కొనియాడారు. ఈయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని తమ వంతు సహకారంగా అనాథలను గుర్తించి సేవా భావంతో తమకు తోచిన సహకారం అందించాలని సి ఐ వెంకటేషులు అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సుబ్రహ్మణ్యం, జల్లా కుటుంబ సభ్యులు వెంకటేష్, నవీన్, మంజుల, ఆదిమూర్తి, లక్ష్మీనరసమ్మ, మోహన, మురళి, సుస్మిత మరియు షేక్షావల్లి, బి. సురేష్ నాయుడు, బత్తిని కుమార్ తదితరులు పాల్గొన్నారు..

# బాపట్ల తూర్పు సత్రం స్థలం అద్భుత సుందరీకరణ చేస్తా

## ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు



**నేటి సాక్షి,బాపట్ల జిల్లా (బాపట్ల టౌన్) :** బాపట్ల తూర్పు సత్రం స్థలం అద్భుత సుందరీకరణ చేస్తానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. బాపట్ల పట్టణంలోని పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రాన్ని పరిశీలించి చేపట్టబోయే అభివృద్ధి కార్యమాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ బాపట్ల పట్టణ దాత, వందల ఎకరాలను పేదల కోసం దానం చేసిన మహనీయుడు పేరం గరుడాచలం నాయుడు జ్ఞాపకార్థం తూర్పు సత్రం స్థలాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రకటించారు. బుధవారం తూర్పు సత్రం స్థలాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న కమిటీతో పాటు, తూర్పు సత్రం నిర్వహణ కోసం మరొక 9 మందితో కూడిన ప్రత్యేక పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. స్థలంలో క్రమబద్ధమైన షాపుల నిర్మాణం చేపడతాం. ప్రజల కోసం అత్యాధునికమైన సింథటిక్ వాకింగ్ ట్రాక్, అందమైన పార్కు ఏర్పాటు చేస్తాం. ఈ ప్రాంతం మొత్తాన్ని "పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రం" పేరుతో పట్టణంలోనే ఒక ఆకర్షణీయమైన కేంద్రంగా తీర్చిదిద్దుతాం."బాపట్ల పట్టణ అభివృద్ధికి భూములు దానం చేసిన గొప్ప వ్యక్తుల ఆశయాలను గౌరవిస్తూ, ఆయా ఆస్తులను పరిరక్షించి ప్రజలకు ఉపయోగపడేలా చేయడం మా బాధ్యత" అని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. 70 లక్షల వ్యయంతో కర్మకాండలు చేయడానికి పురాణ కాలక్షేప మండపం నిర్మిస్తున్నామని త్వరలోనే పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలియజేశారు. ఆక్రమణలకు తావు లేకుండా, పారదర్శకమైన కమిటీల ద్వారా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, తూర్పు సత్రం చైర్మెన్ తులసీ కుమారి, జనసేన నాయకులు విన్నకోట సురేష్, తూర్పు సత్రం మెంబెర్స్, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలిగితే సహించేది లేదు



- ధాన్యం కొనుగోలులో పారదర్శకత ఉండాలని ఆదేశం
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు

**నేటి సాక్షి,బాపట్ల జిల్లా (బాపట్ల రూరల్) :** ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ముఖ్యంగా రైతులకు సేవలందించే విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్పష్టం చేశారు. బుధవారం బాపట్ల మండలం ఈతేరు గ్రామంలో పర్యటించిన ఆయన, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని కొలిచే యంత్రాల పనితీరును పరిశీలించారు. నిబంధనల పేరుతో రైతులను గంటల తరబడి నిరీక్షించకుండా వేగంగా సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో దళారుల ప్రమేయం అస్సలు ఉండకూడదు. రైతులకు నేరుగా ప్రభుత్వం నుండి నగదు జమ అయ్యేలా ఆన్‌లైన్ ప్రక్రియను పర్యవేక్షించాలి అని సిబ్బందిని హెచ్చరించారు. కేంద్రంలో సరిపడా గోనె సంచులు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే, అక్కడ అందుతున్న సేవలపై ప్రజల నుంచి ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరును ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటున్న సమయాన్ని తనిఖీ చేశారు. ప్రజలు సమర్పించిన అర్జీలు ఎన్ని పరిష్కారమయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలను రిజిస్టర్ల ద్వారా పరిశీలించారు. వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించకుండా జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ.. "ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే.. సామాన్యుడికి ఇబ్బంది లేని పాలన అందించడం. అందుకే నేను స్వయంగా క్షేత్రస్థాయికి వచ్చి పనులను పరిశీలిస్తున్నాను. ఈతేరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదు. సచివాలయ సిబ్బంది కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా, ప్రజల సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయి-ంలో పనిచేయాలి." గ్రామంలోని రోడ్ల మరమ్మతులు, మురుగు నీటి కాలువల నిర్మాణంపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతులు సమర్పించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, వెంటనే ప్రతిపాద నలు సిద్ధం చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు స్థానిక నేతలు పాల్గొన్నారు.

# కాలేజీల నిర్మాణం విమర్శలకు సీఎం చంద్రబాబు స్పష్టత

- పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలు పూర్తిగా ప్రభుత్వ కళాశాలల పేరుతోనే కొనసాగుతాయని సీఎం స్పష్టం..




**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా :-: మాజీ సీఎం వైయస్ జగన్ తీసుకొచ్చిన సంస్కరణలో భాగంగా మొట్టమొదటైన గ్రామ, వార్డు సచివాలయాలు గత ప్రభుత్వ పాలనలో ఎంతో విశిష్టత తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అలాంటి వ్యవస్థ పేరు మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర□యం తీసుకుంది. బుధవారం కలెక్టర్ల కానారేన్స్‌లో సీఎం చంద్రబాబు వాటి పేర్లను ప్రకటిస్తూ ఇకపై 'స్వర□గ్రామం'గా పిలవబడుతుందని సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పలువురు మంత్రులు, జిల్లా కలెక్టర్లు, కార్యదర్శులు, హెచ్ఓడీలు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర అభివ ృద్ధి, సంక్షేమ పథకాలు, పరిపాలనా సంస్కరణలపై సీఎం చంద్రబాబు విస్తృతంగా మాట్లాడారు. కాగా శాఖలు, జిల్లాల వారీగా కలెక్టర్ల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాలపై కలెక్టర్లు, ఉన్నతాధికారులకు సూచనలు జారీ చేశారు. నిర్దేశిత గడువులోగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల కాలంలో సుమారు 3 లక్షల ఇళ్లకు సామూహిక గ ృహ ప్రవేశాలు నిర్వహించామని ఉగాది నాటికి మరో 5 లక్షల గ ృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించబోతున్నామని ప్రతి మూడు నెలలకు టార్గెట్ పెట్టుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. గతంలో ఊళ్లకు దూరంగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. కొందరు లబ్ధిదారులు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. తిరుపతి లాంటి నగరాల్లో ఈ సమస్య ఉంది. లబ్ధిదారులతో సంప్రదించి ఇతర ప్రాంతాల్లో వారికి స్థలాలు కేటాయించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై వచ్చిన విమర్శలకు సీఎం చంద్రబాబు స్పష్టత ఇచ్చారు.

పీపీపీ పద్ధతిలోనే మెడికల్ కాలేజీలు..

పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై వచ్చిన విమర్శలకు సీఎం చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలు పూర్తిగా ప్రభుత్వ కళాశాలల పేరుతోనే కొనసాగుతాయని చెప్పారు. వాటికి సంబంధించిన నిబంధనలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వమే నిర□యిస్తుందని తెలిపారు. ఈ కాలేజీల్లో 100 శాతం అవుట్ పేషెంట్ సేవలు ఉచితంగా ఉంటాయని 70 శాతం మందికి ఎన్‌టీఆర్ వైద్య సేవలు అందుతాయని చెప్పారు. సీట్ల సంఖ్య కూడా పెరిగిందని వెల్లడించారు. విమర్శలు చేసే వారు వాస్తవాలు తెలుసుకోవాలని సీఎం చంద్రబాబు హితవు పలికారు. రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ నిర్మించి డబ్బులు వ ృథా చేశారని విమర్శించారు. ఆ నిధులు ఉంటే ఇప్పటికే రెండు మెడికల్ కాలేజీలు నిర్మించి ఉండేవాళ్లమని వ్యాఖ్యానించారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో సాధిస్తున్న త్రైమాసిక ఫలితాలను విద్యార్థి పరీక్ష ఫలితాలు లాగా ఎదురు చూస్తానని అన్నారు. అధికారులంతా లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకోవాలని సూచించారు. గత రెండు త్రైమాసికాల్లో మంచి ఫలితాలు సాధించామని, ఈసారి వ ృద్ధి లక్ష్యాన్ని 17.11 శాతంగా పెట్టుకున్నామని తెలిపారు. మొత్తం 17 వర్టికల్స్‌లో ఫలితాలు సాధిస్తేనే జీఎస్డీపీ పెరుగుతుందని స్పష్టం చేశారు. అభివ ృద్ధి వికేంద్రీకరణ ద్వారా వెనుకబడిన ప్రాంతాలకు చేయూత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి యూనిట్, ప్రతి శాఖలో సామర్థ్యాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. వచ్చే కలెక్టర్ల సదస్సు నాటికి ప్రగతిలో, అధికారుల పనితీరులో క్వాంటమ్ ఇంప్రూవ్‌మెంట్ కనిపించాలన్నది తన ఆశయమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# సంకెపల్లి సర్పంచ్, ఉప సర్పంచ్ లను అభినందించిన ఎమ్మెల్యే



**నేటి సాక్షి ప్రతినిధి శంకర్పల్లి న్యూస్ :** శంకర్‌పల్లి మండల పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సంకెపల్లి గ్రామపంచాయతీకి నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ సర్పంచ్ గా దేశ్ పాండే శ్రీనివాస్, ఉప సర్పంచ్ గా ఉప్పరి రవీందర్ సగర, వార్డ్ మెంబర్లుగా తాళ్లపల్లి రుక్కమ్మ, కవ్వగూడెం మల్లేశం యాదవ్, ఉప్పరి లావణ్య శ్రీనివాస్ సగర, తోకల గోవర్ధన్ యాదవ్, తోకల సబిత పరమేశ్వర్ యాదవ్ లు భారీ మెజారిటీతో విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే 5 సంవత్సరాలలో గ్రామాన్ని అభివృద్ధి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టడం కోసం కృషి చేస్తానని, గ్రామాభివృద్ధికి సంపూర్ణంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజా ప్రతినిధులను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

# ఎంపీటీసీ జెడ్ పి టి సి, ఎన్నికల ఎన్నికల నోటిఫికేషన్..

## ఈనెల 23, 27 తేదీల్లో విడుదల చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్,

**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్ ) :** గ్రామ సర్పంచ్ వార్డ్ మెంబర్ ఎన్నికలు మొదటి విడత 11 రెండో విడత 14 మూడో విడత 17 తేదీల్లో పూర్తికానున్న నేపథ్యంలో తదుపరి ఎన్నికల నిర్వహణ సర్కార్ వేగం పెంచినట్లు తెలుస్తుంది 20 26, జనవరి 26న గ్రామ మండల కేంద్రాలలో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొనే లక్ష్యంతో ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలను త్వరిత గతిన నిర్వహించేందుకు ప్రభుత్వం భారీ సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తుంది

# మాతృమూర్తి ఆరోగ్యం పై ద్వారకానాథ్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ..!

## ఆమె దగ్గరుండి నిరంతరం పర్యవేక్షించిన - తంబళ్లపల్లి శాసనసభ్యులు..

## తనయుడితో కాసేపు ఆ మాతృమూర్తి ఓపెన్ హార్ట్..



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా :-: తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి కి ఆయన తల్లి అంటే ఎనలేని ప్రేమ. ఆమెకు తనయుడంటే అంతులేని ప్రేమ. ఇటీవల ఆమె అనారోగ్యం తో బాధపడుతూ తిరుపతిలో ఓ ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్నారు. ఆమె ఆరోగ్యం కొంతమంది మేర కుదుట పడడంతో ఆయన ఊపిరి పీల్చుకున్నారు. నిరంతరం ఆమె వద్దనే ఉంటూ ఎప్పటికప్పుడు ఆ మాతృమూర్తి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తూ వైద్యులను విచారిస్తూ కంటికి రెప్పలా కాపాడారు. అటు పార్టీ కార్యక్రమాలను ఇటు మాతృమూర్తి ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. ఆమె పూర్తిగా అనారోగ్య భారీ నుండి కోలుకోవడంతో బుధవారం మాతృమూర్తితో సరదాగా ముచ్చటించారు. ఆమె ఆరోగ్యం పట్ల నిరంతరం శ్రద్ధ వహిస్తూ కాపాడుకోరావడంతో బిడ్డపై ఎనలేని ప్రేమను కురిపిస్తూ ద్వారకా నాథుడితో సరదాగా కాసేపు చిట్ చాట్ అయ్యారు..

# రెండోసారి గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు

## సర్పంచ్ స్వాతి.



**నేటి సాక్షి.కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 17 :** కాగజ్నగర్ మండలం బురదగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ గా బిఆర్ఎస్.(కోనప్ప వర్గం) బలపరిచిన చేటరే స్వాతి 142 ఓట్లతో గెలుపొందారు.సర్పంచ్ స్వాతి మాట్లాడుతూ రెండవసారి సర్పంచ్ గా గెలిపించినందుకు స్వాతి ( పోశెట్టి ) గ్రామపంచాయతీ ప్రజలకు. మరియు పార్టీ నాయకులకు. కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు గ్రామపంచాయతీని మరింత అభివ ృద్ధి పథంలో తీసుకు వెళ్తానని నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే పాల్పడతానని ఈ సందరరేగా తెలిపారు.

# విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు సహకరించండి

- ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు సహకరించండి: చిన్నబాబు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) రామచంద్రాపురం :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు వారి విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చిన్నబాబు అన్నారు బుధవారం చేకూరి నాగమ నాయుడు యర్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సొసైటీ ఫర్ సోషియల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 10 వ తరగతి విద్యార్థుల అవసరాలను గుర్తించి సొంత ఖర్చులతో పరీక్షలకు ఉపయోగపడే ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్సిల్స్, పెన్లు తదితర స్టేషనరీ సామగ్రిని ఉచితంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యే భవిష్యత్తుకు పునాది అనే నమ్మకంతో విద్యార్థులకు అవసరమైన మౌలిక సహాయం అందించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నామని పిల్లల అభివృద్ధే లక్ష్యంగా, సేవా భావంతో ముందుకు సాగుతున్నామని దూర ప్రాంతాల నుండి తల్లితండ్రులను బంధువులను వదిలి విద్య కోసం ఇక్కడికి వచ్చి విద్యను అభ్యసిస్తున్న పిల్లలకు అవసరమైన విద్యా సామాగ్రిని అందించిన సొసైటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం అభినందించారు ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తోడుగా ఉన్నామన్న ధైర్యం వాళ్లలో కలుగుతుందని ఇలాంటి కార్యక్రమాలు వాళ్లలో గుర్తింపుగా నిలిచిపోయి ప్రేమగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ చేకూరి జనార్ధన్ చౌదరి, సీనియర్ నాయకులు కొట్టే నరసింహా రెడ్డి,మండల విద్యాశాఖాధికారులు మార్కండేయ నాయుడు జయ వేలు, ప్రధానోపా ధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# సర్పంచ్ గా పోటీ చేస్తున్న వ్యక్తి ఆత్మహత్యాయత్నం



**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 17 :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని పెదరాస్పల్లి గ్రామ సర్పంచ్ గా బీ ఆర్ఎస్ పార్టీ తరపున ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బలపరిస్తే సర్పంచ్ గా పోటీ చేస్తున్న బొమ్మెర రాజన్న.ఈరోజు బుధవారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా కుటుంబ సభ్యులు గమనించి కాగజ్నగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కొరకు బాధితుని కుటుంబ సభ్యులు మంచిర్యాల లేక కరీంనగర్ కు తరలించేందుకు సిద్ధమవుతున్నారు.

# బి, ఆ ర్. ఏ స్ నుండి బిజెపిలో చేరిక



**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శి గన్నేరువరం గ్రామ 6 వ వార్డ్ సభ్యులు టేకు అనిల్ గారు వారితోపాటు 20 మంది సభ్యులు బుధవారం నాడు భారతీయ జనతా పార్టీ బిజెపి మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ గారి ఆధ్వర్యంలో చేరడం జరిగింది ఈ సందరరేగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలన పేరిట ఉత్సవాలు నిర్వహించడాన్ని రెండేళ్లలో ప్రభుత్వం చేసింది ఏమీ లేదని రెండేళ్లలో ప్రజా వ్యతిరేకత మూట కట్టుకుందని మాయ మాటలు వాగ్దానాలన్నీ నీటి మూటలేనని విమర్శించారు అనేక అభివ ృద్ధి కార్యక్రమాల కు కేంద్రమే పెద్ద ఎత్తున నిధులు ఇస్తుందని తెలిపారు ప్రజలను మభ్యపెట్టి ప్రయత్నం చేస్తుందన్నారు మండల అభివ ృద్ధికి బండి సంజయ్ కుమార్ కట్టుబడి ఉన్నారని ప్రధానంగా గన్నేరువరం మండల వాసుల చిరకాల వాంఛ మానేరు నది పై వంతెన నిర్మాణం కోసం కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఎంతో కృషి చేశారని తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు మచ్చ బాలరాజు సంధ్య వేణి ప్రశాంత్ యాదవ్ జాలి శ్రీనివాస్ రెడ్డి 8 వ వార్డ్ సభ్యులు మచ్చ సాయికృష[illegible] మధుకర్ రెడ్డి పుల్లెల జగన్ కుర్ర హరీష్ బోయిని వేణు తదితరులు పాల్గొనడం జరిగింది

# కొనుగోలు కేంద్రంలో వరి దొంగతనం

## ఆరోపణతో రైతు భుక్య శారద ఆవేదన



**నేటి సాక్షి, నల్లబెల్లి డిసెంబర్ 17 :** ఐకెపి సెంటర్ ( ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రం )లో అమ్మకానికి వచ్చిన వరి ధాన్యం కుప్పలో నుంచి వడ్లు దొంగతనం జరిగిన సంఘటన గోవిందపురంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం నల్లబెల్లి మండలం గోవిందాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రంలో వరి అమ్మకానికి తెచ్చిన వడ్లు ఒక రాశిగా పోసి ఎండబెట్టే తరుణంలో కష్టపడి పండించిన వడ్లను గుర్తుతెలియని వ్యక్తులు డిసెంబర్ 16 రాత్రి కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన తన రాసి కుప్పలో నుంచి 2 ఎకరాల వడ్లను గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా తరలించినట్లు భుక్య శారద స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రాత్రివేళ కొందరు వ్యక్తులు వరి సంచులు వాహనంలో లోడ్ చేస్తున్నట్లు గ్రామస్తులు గమనించినట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనతో తన కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడిందని, సాగు కోసం తీసుకున్న అప్పులు ఎలా తీర్చాలో అర్థంకావట్లేదని భుక్య శారద వేదన వ్యక్తం చేశారు. తక్షణమే దోషులను గుర్తించి, తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసి. ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులను న్యాయం చేయాలని కోరారు.

# లచంతీసుకుంటూ పట్టుబడ్డ సర్వేయర్



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి డిసెంబర్ 27** :పుంగనూరు తాహశిల్దార్ కార్యాలయం లో ఏసీబీ దాడులు.20 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ కి పట్టుబడ్డ గ్రామ సర్వేయర్ శ్రీరాములు మంగళం పంచాయతీ లో ఎనిమిది గుంటల భూమి సర్వే కొరకు 15 రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్న రైతు ఉమాశంకర్ ను పలుమార్లు తిప్పించి, సర్వే సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ 50 వేలు ఒప్పందం కుదుర్చుకున్న సర్వేయర్ శ్రీరాములు,నేడు అడ్వాన్సుగా రూ 20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సర్వేయర్ శ్రీరాములు.

# కోహినూరు వజ్రం కంటే టీటీడీ స్థలానికి వెలువెక్కువ?



- వాటి విలువ వెలకట్టలేం.. భూమన కరుణాకర్ రెడ్డి..
- శంకరయ్య సులేమాన్ అయినట్టు ఒబెరాయ్ వాళ్లకు ముంతాజ్ హెూటల్ స్వరంగా మారిందని విమర్శలు..

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా :–: టూరిజం భూమి తీసుకొని టీటీడీ ఆ భూమిని ఒబెరాయ్ గ్రూప్ కు కట్టబెట్టడం దారుణమని టీటీడీ మాజీ చైర్మన్, ఉమ్మడి జిల్లాల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తిరుపతి మాజీ శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. కేటాయింపు జరిగిన భూమిని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలిపిరికి అతి సమీపంలో భూములను కేటాయించడం జరిగిందన్నారు. డిసెంబర్ 11న క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకొని అత్యంత వేగంగా 13న జీవో జారీ చేశారన్నారు. టూరిజం స్థలానికి ఎకరం 90 లక్షల రూపాయల విలువ ఉందన్నారు. గజం రూ.49 వేలు, ఎకరాకు 26కోట్ల రూపాయలు విలువ చేసే 20 ఎకరాలు రూ.460 కోట్ల విలువైన భూములను ఒబెరాయ్ గ్రూప్ కు టీటీడీ దోచిపెట్టిందని భూమన విమర్శించారు. బహిరంగ మార్కెట్లో వాటి విలువ రూ.3వేల కోట్లకు పైగానే ఉంటుందన్నారు. కోహినూరు వజ్రం కంటే టీటీడీ స్థలానికి విలువ ఎక్కువన్నారు. వాటి విలువ వెల కట్టలేమని భూమన స్పష్టం చేశారు. టూరిజం శాఖ నుంచి టీటీడీ కేవలం రేరీ.18 కోట్లకే స్థలాన్ని తీసుకుందని పేర్కొన్నారు. ఒబెరాయ్ హెూటల్ లీజు డీన్ మనీని ఎందుకు మాఫీ చేశారని భూమన కరుణాకర్ రెడ్డి ప్రశ్నించారు. దాని వల్ల భగవంతుడికి ఇచ్చిన ఇనామ్ భూమి ప్రైవేట్ వ్యక్తులపరమైందని విమర్శించారు. శంకరయ్య సులేమాన్ అయినట్లు, ఒబెరాయ్ ముంతాజ్ హెూటల్ వాళ్లకు టీటీడీ స్వరంగా మారిందని భూమన ఎద్దేవా చేశారు. మూడు వేల కోట్ల విలువైన భూమిని ఒబెరాయ్ గ్రూప్ కు తక్కువ ధరకే కట్టబెట్టారని ఆరోపించారు. 13న జీఓ జారీ చేస్తే ఇప్పటి వరకు అది ఆన్లైన్ కాకపోవడంపై అనుమానాలను వ్యక్తం చేశారు. భూమిని డిసెంబర్ 5న రిజిస్ట్రేషన్ చేశారని అది కూడా ఆన్లైన్ లో చూపించడం లేదన్నారు. ఒబెరాయ్ గ్రూప్ కు కేటాయించిన భూమిలో ఎర్ర చందనం చెట్లు ఉన్న విషయాన్ని తాను స్వయంగా పరిశీలించానని భూమన వెల్లడించారు.


### వంద రూములతో 1500 మందికి ఉద్యోగాలా..

100 రూములను ఒబెరాయ్ హెూటల్ నిర్మిస్తే 1500ల మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం ప్రజలకు చెప్తోందన్నారు. అది ఎలా సాధ్యమో తనకు తెలియడం లేదన్నారు. కేవలం హెూటల్ పేరు మార్చి అనుమతులు మంజూరు చేయడాన్ని తప్పుబట్టారు. పరకామణి దోపిడీ కంటే అతిపెద్ద దోపిడీగా అభివర్ణించారు. ప్రైవేట్ హెూటల్స్ కు టీటీడీ స్థలం దారాదత్తం చేయడం దారుణమని తెలిపారు. దాని వల్ల టీటీడీకి రూపాయి లాభం లేదని విమర్శల వర్షం కురిపించారు. ఎవరికి మేలు చేయడానికి రూ.2 కోట్ల బిల్డింగ్ ఫీజు సర్దుబాటు చేశారని 26 కోట్ల స్టాంప్ డ్యూటీ మాఫీ చేశారని ప్రశ్నించారు. దివంగత నేత స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనాడు తీసుకొచ్చిన ఏడు కొండలు పరిధిలోనే ఈ భూములు ఉన్నాయని గుర్తు చేశారు. తిరుమల వెంకటేశ్వర స్వామికే మూడు నామాలు పెడతారానని భూమన నిలదీశారు. జిల్లా కలెక్టర్ కూడా నైతిక బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు.

### అలిపిరి వద్ద అనుమతులు లేకుండా పనులు ఎలా జరుగుతున్నాయి..

అనుమతులు లేకుండా అలిపిరి వద్ద పనులు ఎలా జరుగుతున్నాయని ఎర్ర చందనం దుంగలు ఏమయ్యాయో టీటీడీ వాళ్లు సమాధానం చెప్పాలన్నారు. రెవెన్యూ ల్యాండ్ ఇచ్చే అవకాశమున్నా కూడా ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో ఉన్న భూమిని ఇవ్వడం వెనుక మతలబు లేంటని భూమన ప్రశ్నించారు. స్వామీజీలు దీనిపై మౌనం వీడి పోరాటం చేయాలని భూమన కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# తండ్రి ఆశయాన్ని తల్లి ద్వారా సాధించిన తనయుడు



**నేటి సాక్షి ప్రతినిధి చేవెళ్ల న్యూస్ రంగారెడ్డి జిల్లా :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం కమ్మెట గ్రామంలో ఇటీవల రెండో విడత సర్పంచి ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి పద్మ కృష్ణ గౌడ్ విజయం సాధించారు కృష్ణ గౌడ్ 6 నెలల క్రితం మరణించగా అతని ఆశయం గ్రామ సర్పంచి కావాలనే కోరిక ఉండేది కానీ ఆ ఆశయం నెరవేరకుండా భగవంతుడు అతన్ని గ్రామ ప్రజల నుండి దూరం చేసినాడు ఆయన పోయిన సర్పంచి ఎన్నికలలో కమ్మెట గ్రామానికి ఉపసర్పంచిగా సేవలందించినాడు అట్టి మనిషిని గ్రామ ప్రజలు కూడా ఈసారి వచ్చే ఎలక్షన్లలో గ్రామ సర్పంచిగా పోటీ చేయాలని గ్రామ ప్రజల కోరిక కృష్ణ గౌడ్ గ్రామ ప్రజలకు సేవ చేయాలనే కోరిక ఉండేది ఇలాంటి సమయంలో ప్రజల నుండి దూరం అవ్వగా తండ్రి యొక్క ఆశయ సాధన కోసం కొడుకు శశిధర్ గౌడ్ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎలక్షన్లలో గ్రామంలో బీసీ జనరల్ రాగా తల్లి పద్మ కృష్ణ గౌడ్ ను బరిలో దింపినాడు ఇట్టి సమయంలో గ్రామ ప్రజలు పద్మ కృష్ణ గౌడ్ కు శశిధర్ గౌడ్ గ్రామ ప్రజలు యువకులు మహిళలు పెద్దలు చాలా మంచిగా సపోర్ట్ చేసి తనయుడు యొక్క మంచితనము తల్లి పద్మ కృష్ణ గౌడ్ ను విజయం వైపు నడిపించాయి ఈ యొక్క విజయాన్ని తండ్రి కీర్తిశేషులు కృష్ణ గౌడ్ కోరికను ప్రజల అండదండలతో అంకితం చేసినాడు ఈ విజయాన్ని గ్రామ ప్రజలకు యువకులకు మహిళలకు గ్రామ పెద్దలకు పేరుపేరునా పద్మ కృష్ణ గౌడ్ కొడుకు శశిధర్ గౌడ్ అందరికీ కృతజ్ఞతలు తెలిపినాడ గ్రామ ప్రజలకు ఏ ఆపద వచ్చిన నేను మీ సేవకుడిలా పనిచేసేందుకు ఎప్పుడు ముందుంటాను గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు గ్రామ ప్రజల సహాయంతో ఎలాంటి కలమషం లేకుండా మీ ఇంటి మనిషిలా పనిచేస్తానని ఈ విజయాన్ని అందించిన గ్రామ ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు

# ఎమ్మెల్యే చొరవతో తారు రోడ్డు నిర్మాణం

- ప్రసన్న వెంకటేశ్వరపురం నుండి కుప్పం బాదురు వరకు డబుల్ రోడ్డుపై చంద్రగిరి శాసనసభ్యులు నాని చొరవతో తారు రోడ్డు నిర్మాణం



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) రామచంద్రాపురం :** మండలంలోని తిరుపతి ౹దేవలంపట రాష్ట్ర రహదారిలో ప్రసన్న వెంకటేశ్వరపురం ( పివిపురం ) నుండి కుప్పం బాదురు వరకు డబుల్ రోడ్డుపై చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ ( నాని) చొరవతో తారు రోడ్డు నిర్మాణం చురుకుగా సాగుతున్నది. పీవీ నుండి నాలుగు కిలోమీటర్లు కుప్పం భాదూరు వరకు వర్షాలకు రోడ్డు గుంతల మయం కావడంతో వాహన చోదకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. స్థానిక గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకురావడంతో వెంటనే రోడ్లు భవనాల శాఖ అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయించారు. గుత్తేదారు బొల్లినేని శుభగిరి తారు రోడ్డు నిర్మాణాన్ని ఆర్ అండ్ బి ఏ ఈ ధనలక్ష్మి,, వర్క్ ఇన్స్పెక్టర్ చిరంజీవుల పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాలతో చురుకుగా సాగిస్తున్నారు. దీంతో వాహన చోదకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
గురువారం
18 డిసెంబర్ 2025


# ప్రజలు నా పాలనను మెచ్చడం లేదు..!

- మంచి చేశామని ప్రజల నుంచి వస్తేనే సత్ఫలితం..!
- యంత్రాంగం పాలనలో వైఫల్యాలను చెప్పకనే చెప్తున్న - రాష్ట్ర ముఖ్యమంత్రి

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా -:- ప్రభుత్వమంటే యంత్రాంగం. ఆ ప్రభుత్వాన్ని నడిపించేది రాజకీయ పార్టీలు. అలా అవకాశం ఇచ్చేది ప్రజలు. అందుకే ప్రజలు ఆశించిన పాలన చేయాలి. అది ప్రభుత్వం కర్తవ్యం కూడా. దానినే ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తు చేస్తున్నారు. 18 నెలల పాలన పూర్తయిన సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టర్లతో పాటు ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష జరిపారు. మనం బాగానే పాలన సాగిస్తున్నామని భావిస్తున్నాం. కానీ ప్రజల నుంచి అది వస్తేనే సత్ఫలితమని చంద్రబాబు చెప్పుకొచ్చారు. తద్వారా యంత్రాంగం పాలనలో వైఫల్యాలను గుర్తు చేస్తున్నారు. వాటిని సరి చేసుకోవాలని చెప్పకనే చెప్పుకొచ్చారు. అయితే వైఫల్యాలు, ప్రజాభిప్రాయం విషయంలో తన గురించి కూడా తాను చెప్పుకొచ్చారు. తాను సైతం మెరుగైన పాలన అందిస్తున్నానని భావిస్తున్నప్పటికీ ప్రజల నుంచి ఆ స్థాయిలో సంతృప్తి లేదని చంద్రబాబు చెప్పేశారు. దాన్ని వైసీపీ వాళ్లు తెగ ట్రోల్ చేస్తున్నారు.



### సంతృప్తి స్థాయిని అందుకోవాలని..

ప్రభుత్వంతో పాటు యంత్రాంగంలో వైఫల్యాలను ఎప్పటికప్పుడు అధిగమిస్తూ ప్రజల సంతృప్తి స్థాయిని అందుకోవాలనేది చంద్రబాబు పునరాలోచన. ఆయన ఏ సమావేశంలో అయినా ఇదే చెబుతూ వస్తున్నారు. ప్రజల సంతృప్తి స్థాయిని అందుకోవాలని అధికారులకు సూచిస్తున్నారు. పాలనలో బ్యూరోక్రసీ వ్యవస్థ కీలకమని ఆ వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు ప్రభుత్వ పాలనా తీరును, వైఫల్యాలపై సమీక్ష జరపడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలన్నది చంద్రబాబు ఆలోచన.

# గ్రామాల్లో ప్రజలకు మెరుగైన పాలన అందించాలి



- కాంగ్రెస్ పార్టీ నూతన ప్రజా ప్రతినిధులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచన

**నేటి సాక్షి పాలేరు ,డిసెంబర్ 17 :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచిన ప్రజా ప్రతినిధులను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన పాలన. అందించడమే ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు శాలువ కప్పి, స్వీట్లు తినిపించి మంత్రి అభినం దనలు తెలిపారు. అలాగే ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులను కూడా అభినందిస్తూ... గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకంగా, బాధ్యతతో వ్యవహరించాలని కోరారు.ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులను కూడా కలిసి ఆయన మాట్లాడారు. అధైర్యపడొద్దని, పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తూనే ఉండాలని హితవు పలికారు. అందరూ కలిసికట్టుగా ముందుకు సాగితే కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధైర్యం చెప్పారు.

# నేరాల రహిత జిల్లాగా మార్చడమే ప్రధాన లక్ష్యం

- “ఊరూరా పోలీసుల అవగాహన
- మీడియా ముసుగులో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు.. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 17 :** అన్నమయ్య జిల్లా -:- మండలాల్లోని ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధిలోని రక్షకభటుల నిరంతర కృషి ద్వారా నేరాల రహిత జిల్లాగా మార్చవచ్చని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అన్నారు. నేరాల రహిత జిల్లాగా మార్చడమే మా ప్రధాన లక్ష్యమని ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండల పోలీస్ స్టేషన్ సిబ్బంది గ్రామాల పరిధిలోని విద్యాసంస్థల్లో ఆ శాఖధికారులు సమైక్యతలో బుధవారం విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ‘డిజిటల్ అరెస్ట్’ బెదిరింపులకు భయపడవద్దని గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పకూడదని గుర్తు తెలియని వ్యక్తులు మొబైల్ ఫోన్లలో వివరాలు అడిగిన చెప్పొద్దని సూచించారు. వేధింపుల నివారణకు ‘శక్తి యాప్’ వాడకం, చిన్నపిల్లలపై అకృత్యాలను అరికట్టే ‘పోక్సో’ చట్టంపై, బాల్యవివాహాలపై ప్రజలను చైతన్యపరిచారు. మైనర్ డ్రైవింగ్‌పై నిఘా ఉంచామని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమ పరిధిలో ఏదైనా అనుమానాస్పద చర్యలు గమనిస్తే వెంటనే 112 నంబర్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని అధికారులు కోరారు. మట్కా, కోడిపందాలు, గంజాయి, అక్రమ మద్యం, అక్రమ ఇసుక రవాణా, శ్రీగంధం తదితరాలపై నిరంతరం నిఘా ఉంటుందని డ్రోన్ ల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందని ఏ కేసులో చిక్కుకున్న బయటకు రావడం తద్యమని ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలంటూ పోలీసులు అవగాహన కల్పించారు. మీడియా కూడా ప్రత్యేక పాత్ర పోషించాలని సర్వహక్కులు మీడియాకు ఉన్నాయని కానీ మీరు చేతుల్లోకి తీసుకోకుండా మాకు తెలియజేయాలని మీడియా ముసుగులో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎంతటి వారినైనా కఠినంగా శిక్షిస్తామని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఓ ప్రకటనలో తెలిపారు..



# బహుజన సేవా సమితి నూతన కార్యవర్గం ఎన్నిక

**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి డిసెంబర్ 17 :** పుంగనూరు నియోజవర్గం చౌడేపల్లి మండలంలోని బహుజన సేవా సమితి రిజిస్ట్రేషన్ నెంబర్ 174/2024 నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు గుండ్లూరు కృష్ణమూర్తి మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారం సాధనలో భాగంగా ఎస్సి,ఎస్టీ,బిసి,మైనారిటీలందరిని కలుపుకోని, ఏకతాటిపై నడవడానికి ఈ సంస్థను ఏర్పాటుచేయడం జరిగిందని, ఈ సంస్థ పూర్తిగా ప్రపంచ మేధావి బాబాసాహేబ్ డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సిద్ధాంతాలకనుగుణంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. నూతన కార్యవర్గం లో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా గుండ్లూరు వేణుగోపాల్,ప్రధాన కార్యదర్శిగా శ్రీరాములు, చౌడేపల్లి మండలాధ్యక్షులుగా వసంతపల్లి చెంగల్రాయలు, కార్యదర్శిగా శేఖర్ బాబు, ఉపాధ్యక్షులుగా మునస్వామి, శెట్టిపేట శంకర, నరేష్, సంయుక్తకార్యదర్శిగా గడియారం శ్రీనివాస మూర్తి, ఖోశాధికారిగా శేఖర్, గంగాధర్, వెంకట్రమణ, గురుశేఖర్, సమీర్ భాషా, నరసింహులు, నారాయణ, గౌరవాధ్యక్షులుగా పొదలపల్లి రమణ ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.ఎన్నికకాబడిన వారు రెండు సంవత్సరాలు పదవికాలం లో ఉటారని, అందరూ బాబాసాహేబ్ సిద్ధాంతాలను అభివృద్ధి బాటలో నడిపించాలని ప్రమాణం చేయించారు. ఎన్నికైన వారు వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# పెన్షనర్స్ డే నిర్వహించిన విశ్రాంత ఉద్యోగులు



**నేటి సాక్షి. కొమరం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 17 :** కొమురం భీం ఆసిఫాబాద్ కాగజ్ నగర్ పట్టణంలో విశ్రాంత ఉద్యోగులు. ఈరోజు విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో విశ్రాంతి ఉద్యోగులు D.S.నకారే చిత్రపటానికి పూలమాలలంకరించి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి ఎం.జయదేవ అబ్రహాం అధ్యక్షులు మాట్లాడుతూ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పింఛన్ దారులందరూ పెన్షన్ పొందుతూ ప్రశాంతమైన జీవితం గడుపడం వెనుక స్వర్గీయ ధరం స్వరూప్ నాకారా . చేసిన కృషి, కొనసాగించిన న్యాయ పోరాటం చిరస్మరణీయం. అంతేగాకుండా “పెన్షన్ అంటే భిక్ష కాదూ. ప్రభుత్వం ఇచ్చే దయా ధర్మం కాదూ. పెన్షన్ ఒక హక్కు, దానిని చెల్లించవలిసిన భాధ్యత ప్రభుత్వాలదే.అనీ అద్భుతమైన తీర్పు నిచ్చి పెన్షనరలందరికి న్యాయం చేసిన సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ వై వీ చంద్రచూడ్. పెన్షన్ పొందుతున్న యావత్ పెన్షనర్లంరికీ చిరస్మరణీయులు, అట్టిహక్కును విశ్రాంత ఉద్యోగులందరూ కాపాడుకోవాల్సిన సమయము ఆసన్నమైనదని తెలిపినారు.ఇట్టి కార్యక్రమము లో కార్యదర్శి ఎం.శివ ప్రసాద్, రాజేంద్రప్రసాద్, అంకయ్య, అన్వర్ అహ్మద్, కె.నరసయ్య, మురళీధర్ రావు కె. పురుషోత్తం కుమార్ బి.నర్సయ్య, కిషన్ కుమార్ రామయ్య మురారి, నారాయణ,శివలింగం, సలీం,.రామయ్య,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మండలవనరుల కేంద్రానికి భూమిపూజ



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి డిసెంబర్ 17 :** పుంగనూరు నియోజవర్గం చౌడేపల్లి మండలంలోని మండల వనరుల కేంద్రం, పాతబడిపోవడంతో నూతన భవనం నిర్మాణం కొరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయ ఆవరణంలో నూతన భవనానికి బుదవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కేశవరెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండటం వలన పరిపాలనా సౌలభ్యం బాగుంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి లీలామాధురి, మడల విద్యాశాఖాధికారిణి తిరుమలమ్మ,నాయకులు ఆవుల రామచంద్ర,పవన్,చిన్నరెడ్డెప్ప, ఉపాద్యాయబృదం పాల్గొన్నారు.

# బోయకొండ గంగమ్మకు విరాళాల వెల్లువ



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి డిసెంబర్ 17** :మండలంలోని పంచాయతీ కేంద్రం గడ్డంవారిపల్లి లో గల బోయకొండ గంగమ్మ ఆలయానికి విరాళాలు వెలుగులా వస్తున్నాయి.అదే గ్రామానికి చెందిన ఓబులేషు అనురాగలు పంచలోహ గంట శివారుపల్లి అంకన్న అలివేలమ్మలు బీరువాను విరాళంగా అందించారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.మీ చుట్టుప్రక్కల ఎవరైనా ఉంటే బోయకొండగంగమ్మ దేవస్థానానికి విరాళాలు ఇప్పించి అమ్మవారి కృపకు పాత్రులుకాగలరని ఆలయ నిర్మాణదాత తోటిగిరిబాబు తెలియజేశారు.